మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

మంగళవారం 27 -10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 325

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District



## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609


## రక్షణ రంగానికి రూ.2.12 లక్షల కోట్ల బలం!

- భారీ సైనిక కొనుగోళ్లకు రక్షణ కొనుగోళ్ల మండలి ఆమోదం
- రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన కీలక నిర్ణయం
- 82 శాతం కొనుగోళ్లు దేశీయ పరిశ్రమల నుంచే
- సైన్యానికి అత్యాధునిక హెలికాప్టర్లు, కామికాజ్ డ్రోన్లు
- నౌకాదళం, వాయుసేన సామర్థ్యం పెంపునకు ప్రాధాన్యం



03

# ప్రాణనష్టం జరగొద్దు!

**అర్ణబ్' తుపాను హెచ్చరికల నేపథ్యంలో సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష**

- ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని స్పష్టీకరణ
- అక్టోబర్ 28న బాపట్ల--విశాఖ మధ్య తీరం దాటే అవకాశమని హెచ్చరికలు
- గంటకు గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం
- భారీ నుంచి అత్యంత భారీ వర్షాల నేపథ్యంలో తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్
- లోతట్టు, తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు
- తుపాను గమనాన్ని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్లకు సూచన
- రైతులు, మత్స్యకారులు, ప్రజలకు ముందస్తు హెచ్చరికలు అందించాలని దిశానిర్దేశం

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందన్న హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుపాను కారణంగా ఒక్కప్రాణమూ కోల్పోకుండా, ఆస్తినష్టాన్ని సాధ్యమైనంత వరకు నివారించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోమవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కేంద్రాలను సిద్ధం చేయడం, వర్షాలు, వరదల తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అందిన వాతావరణ హెచ్చరికల ప్రకారం అక్టోబర్ 28న బాపట్ల--విశాఖపట్నం మధ్య తుపాను తీరం దాటే అవకాశముందని, ఆ సమయంలో గంటకు గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదముందని అధికారులు వివరించారు. అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, పోలీసు, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు.

అమరావతి, ఏపీ బ్యూరో,
బంగాళాఖాతంలో ఏర్పడినట్లు పేర్కొంటున్న 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని సమీపిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుపాను ప్రభావంతో రాష్ట్రంలో ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా చూడాలని, ఆస్తినష్టాన్ని సాధ్యమైనంత వరకు నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణరక్షణే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన

-మిగతా 3 లో





## అవి ఏకగ్రీవాలు కాదు.. బలవంతపు విజయాలు!

- స్థానిక సంస్థల ఎన్నికల ఏకగ్రీవాలపై వైఎస్ షర్మిల ఆగ్రహం
- అధికార బలంతో కూటమి పార్టీలు ఏకగ్రీవాలు చేయించాయని ఆరోపణ
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- ఎన్నికల సంఘాన్ని 'కూటమి కమిషన్'గా మార్చారంటూ ధ్వజం
- ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్లు చించివేసి బెదిరించారని ఆరోపణ
- గత వైసీపీ ప్రభుత్వ తప్పులనే కూటమి పునరావృతం చేస్తోందని మండిపాటు
- ఏకగ్రీవ ఎన్నికల ఫలితాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్
- అక్రమాల ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి

**అమరావతి, ఏపీ బ్యూరో, అక్టోబర్ 26 డ్రీమ్ టైమ్స్**
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో నమోదైన ఏకగ్రీవాలపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అవి ప్రజల ఆమోదంతో జరిగిన ఏకగ్రీవాలు కావని, అధికార బలంతో కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలని ఆరోపించారు. అధికార దుర్వినియోగంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ధ్వజమెత్తారు. సోమవారం సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన ఆమె.. రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని 'కూటమి కమిషన్'గా మార్చేశారని విమర్శించారు. పోలీసు వ్యవస్థను అధికార పార్టీ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటూ ప్రతిపక్ష

-మిగతా 3 లో



03

## సిరీస్ వేటలో శ్రేయస్ సేన

- నేడు న్యూజిలాండ్‌తో మూడో టీ20
- 2-0 ఆధిక్యంతో జోరుమీదున్న టీమిండియా
- గాయంతో ఇషాన్ కిషన్ దూరం.. వైభవ్ సూర్యవంశీకి మరో ఛాన్స్
- హైదరాబాదీ తిలక్ వర్మ, నితీశ్ రెడ్డిపై భారీ ఆశలు
- బౌలింగ్‌లో పుంజుకోవాల్సిన భువనేశ్వర్ కుమార్
- గాయాలతో కివీస్‌కు ఎదురుదెబ్బ.. హెన్రీ, ఫెర్గుసన్ దూరం
- బౌలర్లు, ఫీల్డర్లకు సవాల్‌గా వెల్లింగ్టన్ ఈదురుగాలులు
- మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రసారం

## ట్రంప్ ఆదేశిస్తే 96 గంటల్లో ఇరాన్‌పై దాడులు!

- పశ్చిమాసియాలో అమెరికా సైనిక బలగాల మోహరింపు
- అధ్యక్షుడి ఆదేశాల కోసం సిద్ధంగా ఉన్నట్లు అధికారుల వెల్లడి
- ఇరాన్ రాడార్లు, క్షిపణి ప్రయోగ కేంద్రాలే ప్రధాన లక్ష్యాలు
- అణు కేంద్రాలు, సైనిక స్థావరాలపైనా దాడులకు ప్రణాళికలు
- ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకునే అవకాశం
- మధ్యంతర ఎన్నికల తర్వాత కీలక నిర్ణయం వెలువడే సూచనలు
- అమెరికా వ్యూహాలను పసిగడుతున్న ఇరాన్ దళాలు

: పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ ఉద్రిక్తతలు పెరిగే అవకాశముందన్న వార్తలు వెలువడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు జారీ చేస్తే 96 గంటల్లోనే ఇరాన్‌పై దాడులు చేపట్టేందుకు అమెరికా బలగాలు సిద్ధంగా ఉన్నట్లు సీఎన్ఎన్ కథనం వెల్లడించింది. పశ్చిమాసియాలో భారీగా సైనిక బలగాలను మోహరించిన అమెరికా.. ఇరాన్‌కు చెందిన రాడార్ వ్యవస్థలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలు, సైనిక స్థావరాలు, అణు కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకునే అవకాశముందని ఇద్దరు అధికారులను ఉటంకిస్తూ పేర్కొంది.



03

# కోస్తాంధ్రకు రెడ్ అలర్ట్

**ఉత్తర కోస్తాపై విరుచుకుపడనున్న అతి తీవ్ర తుఫాన్ 'ఆర్నబ్'**

- రేపు ఉదయం యానాం వద్ద తీరం దాటే అవకాశం
- ఆ పరిసరాల్లో ముందుకు రానున్న సముద్రం
- నేడు, రేపు కుంభవృష్టి, అతి భారీ వర్షాలు
- గంటకు 115 నుంచి 140 కి.మీ. వేగంతో గాలులు
- వ్యవసాయ, ఉద్యాన పంటలపై ప్రభావం
- కాకినాడ, గంగవరంలో మూడో నంబరు హెచ్చరిక
- పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు



**అమరావతి, ఏపీ బ్యూరో,అక్టోబర్ 26 డ్రీమ్ టైమ్స్**
దేశ తూర్పుతీరంలో ఈ ఏడాది తొలి తుఫాన్ సోమవారం బంగాళాఖాతంలో ఏర్పడింది. ఈ తుఫాన్‌కు బంగ్లాదేశ్ ప్రభుత్వం సూచించిన పేరు(ఆర్నబ్) పెట్టారు. గతేడాది డిసెంబరులో తమిళనాడులో 'దిత్వా' తుఫాన్ తీరం దాటింది. ఆ తర్వాత సుమారు పది నెలలకు ఆర్నబ్ వచ్చింది. హిందూ మహాసముద్రం నుంచి తేమ మేఘాలు బంగాళాఖాతం వైపు రావడంతో అక్కడ ఉపరితల ఉష్ణోగ్రతలు 29 నుంచి 30 డిగ్రీలు వరకు నమోదవుతున్నాయి. దక్షిణ తమిళనాడుకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం నుంచి అవసరమైన తేమగాలులు తుఫాన్ దిశగా వస్తున్నాయి. వీటన్నింటితో ఆర్నబ్ తుఫాన్ బలంగా మారుతోందని, ఉత్తర కోస్తాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడనున్నదని వాతావరణ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ కోస్తాంధ్రకు రెడ్ అలర్ట్ ప్రకటించింది.తూర్పు మధ్య, దానికి ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర వాయుగుండం ఆదివారం రాత్రి వరకు నైరుతి దిశలో పయనించిన అనంతరం పశ్చిమ వాయవ్యంగా దిశ మార్చుకుంది. సోమవారం ఉదయానికి తూర్పు మధ్య బంగాళాఖాతం మీదుగా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి తుఫాన్‌గా బలపడింది. సోమవారం రాత్రికి ఇది తీవ్ర తుఫాన్‌గా మారింది.

-మిగతా 3 లో



03

## జనగణన వివరాలు బయటపెట్టొద్దు!

- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం కీలక ఆదేశాలు
- 2027 జనాభా లెక్కల డేటా గోప్యతకు అత్యంత ప్రాధాన్యం
- మీడియాకు సమాచారం, గణాంకాలు విడుదల చేయరాదని స్పష్టీకరణ
- 1948 జనగణన చట్టం ప్రకారం వివరాలకు రక్షణ
- జనగణన రికార్డుల తనిఖీకి అనుమతి లేదన్న ఆర్‌జీఐ
- పూర్తిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ
- మొబైల్ యాప్‌ల ద్వారా కేంద్ర సర్వర్‌కు సమాచారం
- నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో కాగితపు పత్రాల వినియోగం

## మలేరియా టీకా ధర భారీగా తగ్గింపు.

- వ్యాక్సిన్ ధరను 40 శాతం తగ్గించేందుకు భారత్ బయోటెక్ ఒప్పందం
- గవి, యునిసెఫ్ సంస్థలతో కీలక భాగస్వామ్యం
- డోసు ధర 9.30 యూరోల నుంచి 5.50 యూరోలకు తగ్గింపు
- 2027 ప్రారంభం నుంచి కొత్త ధరలు అమల్లోకి వచ్చే అవకాశం




03



## శ్రీశైలంలో హుండీ ఆదాయం రూ.4.22 కోట్లు

**తేదీ: 26.10.2026 । డ్రీమ్ టైమ్స్ శ్రీశైలం**
: శ్రీశైల దేవస్థానానికి హుండీల ద్వారా రూ.4,22,29,240 నగదు ఆదాయం లభించింది. సోమవారం (26.10.2026) నిర్వహించిన హుండీల లెక్కింపులో ఈ ఆదాయం సమకూరింది. గత 32 రోజులలో, అంటే 24.09.2026 నుంచి 25.10.2026 వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా ఈ మొత్తం లభించింది.బంగారం, వెండి కానుకలు హుండీల లెక్కింపులో 75 గ్రాముల 300 మిల్లీగ్రాముల బంగారం, 2 కిలోల 900 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా విదేశీ కరెన్సీ కూడా లభించింది. వాటిలో 417 అమెరికా డాలర్లు, 65 యూఏఈ దిర్హామ్స్, 60 ఇంగ్లాండ్ పౌండ్లు, 100 కెనడా డాలర్లు, 500 ఒమన్ బైసాలు, ఒక ఒమన్ రియాల్, 25 యూరోలు, 2 మలేషియా రింగిట్లు, 10 సౌదీ రియాల్స్, 10 న్యూజిలాండ్ డాలర్లు, 2 సింగపూర్ డాలర్లు, 10 ఈజిప్ట్ పౌండ్లు ఉన్నాయి.

**పటిష్ట భద్రత మధ్య లెక్కింపు**

పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ, సీసీ కెమెరాల నిఘాలో హుండీల లెక్కింపు నిర్వహించారు. ఈ ప్రక్రియను దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఎస్. చంద్రశేఖర్, వివిధ విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, దేవస్థానం సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

## రెండు కొత్త వందేభారత్ స్లీపర్ రైళ్లు.. రూటు, టైమింగ్ వివరాలు ఇవే



**న్యూఢిల్లీ అక్టోబర్ 26 డ్రీమ్ టైమ్స్**

రెండు వందేభారత్ స్లీపర్ రైళ్లు వచ్చేస్తున్నాయి. ముంబై నుంచి బెంగుళూరు, వారణాసి నుంచి ఢిల్లీకి వెళ్లే వందేభారత్ స్లీపర్ రైళ్లు త్వరలో ప్రారంభంకానున్నాయి. ముంబై-బెంగుళూరు రైలును అక్టోబర్ 31వ తేదీన, వారణాసి-న్యూఢిలీ రైలును నవంబర్ 1వ తేదీన ఆవిష్కరించనున్నారు. అదనపు వేగంతో రాత్రిపూట ఆ రైళ్లు ప్రయాణికులను గమ్యస్థానం చేర్చనున్నాయి. ముంబై -- బెంగుళూరు రైలు సుమారు 1000 కిలోమీటర్ల ప్రయాణాన్ని 15 గంటల 45 నిమిషాల్లో చేరనున్నది. ఇక వారణాసి-ఢిల్లీ రైలు ప్రయాగ్‌రాజ్, కాన్పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ప్రస్తుతం హౌరా-కామాఖ్య మధ్య వందేభారత్ స్లీపర్ రైలు ఉన్న విషయం తెలిసిందే.కొత్తగా ప్రారంభంకానున్న రెండు రైళ్లు వారానికి ఆరు రోజులు నడిచే అవకాశాలు ఉన్నాయి. ముంబై-బెంగుళూరు రైలు సీఎస్ఎంటీ స్టేషన్ నుంచి రాత్రి 8.10 నిమిషాలకు కదులుతుంది. తెల్లవారుజామున ఉదయం 11.55 నిమిషాలకు ఎస్ఎంవీటీ బెంగుళూరు చేరుకుంటుంది. ఇక రిటర్న్ జర్నీలో బెంగుళూరు నుంచి రాత్రి 7.50 నిమిషాలకు బయలుదేరి సీఎస్ఎంటీ 11.55 నిమిషాలకు చేరుకుంటుంది. ఈ రైలు వల్ల సుమారు 6 గంటల 20 నిమిషాల పాటు ప్రయాణ సమయం తగ్గనున్నది. వారణాసి-ఢిల్లీ రైలు వారణాసిలో రాత్రి 8.50 నిమిషాలకు స్టార్ట్ అయి, తెల్లవారుజామున 5.55 నిమిషాలకు ఢిల్లీ చేరుకుంటుంది. రిటర్న్ జర్నీలో ఢిల్లీ నుంచి రాత్రి 9.40 నిమిషాలకు మొదలై,వారణాసికి ఉదయం 6.45కు చేరుకుంటుంది.

## మా కుటుంబాన్ని అంతం చేసేందుకు రూ.600 కోట్ల 'సుపారీ'

**డీకేపై కుమారస్వామి ఆరోపణ**



**న్యూఢిల్లీ: అక్టోబర్ 26 డ్రీమ్ టైమ్స్**

కర్ణాటక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబాన్ని రాజకీయంగా అంతం చేసేందుకు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రూ.600 కోట్ల విలువైన సుపారీ(హత్యకు ఒప్పందం) కుదుర్చుకున్నారని కేంద్ర మంత్రి, జనతాదళ్(ఎస్) నాయకుడు కుమారస్వామి ఆరోపించారు.మాజీ సీఎం సిద్ధరామయ్యకు సంబంధించి జరిగినట్టు చెబుతున్న 'స్టింగ్ ఆపరేషన్' వివాదం ఇప్పటికే కొనసాగుతుండగా ఈ కొత్త ఆరోపణలు పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. దేవెగౌడ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న పలు కుట్రల వెనుక శివకుమార్ ఉన్నారని కుమారస్వామి ఆదివారం ఆరోపించారు. రూ.600 కోట్ల ఒప్పందం కూడా అలాంటి ప్రయత్నాలలో ఒకటని ఆయన అభివర్ణించడంతో ఆయనకు, కర్ణాటక కాంగ్రెస్ నాయకత్వానికి మధ్య మాటల యుద్ధం తీవ్రమైంది.

## బాలికతో కనిపించాడని నగ్నంగా ఊరేగించి..!

**కోల్‌కతా అక్టోబర్ 26 డ్రీమ్ టైమ్స్**



పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. బహేలా ప్రాంతానికి చెందిన 13 ఏండ్ల బాలికను 18 ఏండ్ల యువకునితో పాటు చూసిన ఆ బాలిక కుటుంబ సభ్యులు ఆ యువకుడిని పట్టుకున్నారు. అనంతరం బాలిక తండ్రి, ఆమె మేనమామ ఆ యువకుడిని, అతని స్నేహితుడిని ఒక గదిలో బంధించి తీవ్రంగా కొట్టారు.తరువాత ఆ యువకుడి తండ్రిని కూడా అక్కడికి పిలిపించి, ఆ ముగ్గురిని నగ్నంగా రోడ్లపై ఊరేగిస్తూ, అత్యంత హీనంగా అవమానించారు. ఈ ఘటన చూసిన స్థానికులు బాలిక కుటుంబ సభ్యుల అకృత్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ బాలిక మేనమామను పట్టుకుని, చావబాది పోలీసులకు అప్పగించారు.

# జెన్ జీ దెబ్బకు కూలిన మరో సర్కార్

**-సెర్బియాలో దేశాధ్యక్షుడు అలెగ్జాండర్ వూసిచ్ ఓటమిపాలు**

**-వీధుల్లో యువత సంబురాలు**



**బెల్‌గ్రేడ్:అక్టోబర్ 26 డ్రీమ్ టైమ్స్**

విద్యార్థి ఉద్యమానికి మరో ప్రభుత్వం కుప్పకూలింది. సెర్బియాలో జరిగిన తాజా పార్లమెంటరీ ఎన్నికల్లో సంచలన రాజకీయ మార్పు చోటుచేసుకుంది. దేశాధ్యక్షుడు, రైట్ వింగ్ నేత అలెగ్జాండర్ వూసిచ్ తన ఓటమిని అంగీకరించడంతో, విద్యార్థి నాయకత్వంలోని 'స్టూడెంట్ లిస్ట్' ఉద్యమం విజయం సాధించింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే రాజధాని బెల్గ్రేడ్‌తో పాటు పలు నగరాల్లో వేలాది యువత, విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఘనంగా సంబురాలు చేసుకున్నారు.కార్లపై తిరుగుతూ, గట్టిగా హారన్లు కొడుతూ, పాటలు పాడుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో స్టూడెంట్ లిస్ట్ సుమారు 2.2 మిలియన్ల ఓట్లను(52శాతం ఓటు షేరింగ్) సాధించి, పార్లమెంట్‌లో 135 నుంచి 140 సీట్లను కైవసం చేసుకుని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. అలెగ్జాండర్ వూసిచ్‌కు చెందిన సెర్బియన్ ప్రొగ్రెసివ్ పార్టీ(ఎస్ఎన్ఎస్) సుమారు 1.7 మిలియన్ల ఓట్లను(32.3 శాతం) మాత్రమే సాధించి, దాదాపు 105 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎన్నికల ఫలితాల అనంతరం వూసిచ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు నిర్వహించిన సర్వేలను నమ్ముకుని, తాము ఓడిపోయామని బహిరంగంగా అంగీకరించారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన స్టూడెంట్ లిస్ట్‌కు యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా అభినందనలు తెలిపారు. మరోవైపు సంబురాల సమయంలో సెంట్రల్ బెల్‌గ్రేడ్‌లోని వూసిచ్ అనుచరులు గతంలో ఏర్పాటు చేసిన టెంట్లు, ఫెన్సింగ్‌లను ఆందోళనకారులు తొలగించి నిరసన తెలిపారు. కొన్నిచోట్ల యువకులు పోలీసు వాహనాలపై రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఏదేమైనా అవినీతికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం స్టూడెంట్ లిస్ట్ సాధించిన ఈ విజయం సెర్బియా రాజకీయాల్లో మైలురాయిగా నిలిచింది.

## ఈ100 ఇంధనానికి ఆమోదం

**-త్వరలో మార్కెట్లోకి ఈ100తో నడిచే కార్లు**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 26 డ్రీమ్ టైమ్స్**

దేశంలో 100 శాతం ఇథనాల్‌తో నడిచే ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాల(ఈ100) కోసం కేంద్ర ప్రభుత్వం నిబంధనలను జారీచేసింది. కేంద్ర మోటారు వాహనాల నిబంధనలను సవరించడం ద్వారా ఈ100 ఇంధనాన్ని ఆమోదించింది. కొన్ని వాహన తయారీ సంస్థలు తమ ఈ100 కార్లను మార్కెట్ లోకి విడుదల చేయడానికి సిద్ధమవుతున్న తరుణంలోనే ఈ నిర్ణయం వెలువడింది.అధికారిక ప్రకటన ప్రకారం మోటారు వాహనాల నిబంధనల్లో చేసిన తాజా మార్పుల్లో ఉద్గార నిబంధనలకు సంబంధించి ఈ85 ఇంధనంతో పాటు ఈ100 ఇంధనాన్ని కూడా చేర్చారు. ఈ85, ఈ100 ఇంధనాలను వాటి కోసం ప్రత్యేకంగా రూపొందించిన, ధృవీకరించిన వాహనాల్లో మాత్రమే ఉపయోగించవచ్చని అధికారులు స్పష్టం చేశారు. వీటిని సాధారణ వాహనాల్లో ఉపయోగించకూడదు. ఈ20 పెట్రోల్ లేదా సాధారణ ఇంధనంతో నడిచే వాహనాలు ఈ85 లేదా ఈ100 ఇంధనంతో నడవకూడదని ప్రభుత్వ ప్రకటన స్పష్టం చేస్తున్నది. ఈ కొత్త నోటిఫికేషన్ ప్రకారం ఇప్పటికే వాహనాలు కలిగి ఉన్నవారు తమ కార్లలో ఈ85 లేదా ఈ100 ఇంధనాన్ని వాడాల్సిన అవసరం ఉండదు. అలాగే ఎటువంటి మార్పులు(మోడిఫికేషన్లు) చేయాల్సిన పని కూడా లేదు. ఇది వర్తమానానికి, భవిష్యత్తుకు సంబంధించి పూర్తిగా ఒక ప్రత్యామ్నాయ ఏర్పాటు.

**ఫ్లెక్స్-ఫ్యూయల్ టెక్నాలజీ**

అమెరికా, బ్రెజిల్ వంటి దేశాల్లో ఫ్లెక్స్-ఫ్యూయల్ సాంకేతికతను పెద్ద ఎత్తున ఉపయోగిస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ వాహనాలు ఒకే ఇంధన ట్యాంకులో ఇథనాల్, పెట్రోల్‌ను వివిధ నిష్పత్తుల్లో కలిపి సులభంగా నడిచేలా ప్రత్యేకంగా రూపొందించారు. వాహన రూపకల్పన, ధృవీకరణను బట్టి ఇందులో ఉపయోగించే ఇథనాల్ మిశ్రమం ఈ85 నుంచి ఈ100 వరకు ఉండవచ్చు.

## నేటి నుంచి రైల్వే కౌంటర్ టికెట్లకూ బీమా

**న్యూఢిల్లీ అక్టోబర్ 26 డ్రీమ్ టైమ్స్**



ఇకపై ఆఫ్‌లైన్‌లో రైల్వే కౌంటర్ల వద్ద టికెట్లు కొనుగోలు చేసిన ప్రయాణికులకు కూడా ప్రయాణ బీమా పథకం సదుపాయం అందుబాటులోకి రానుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అమలవుతున్న ఈ పథకం అక్టోబర్ 27 నుంచి అందుబాటులోకి రానుంది. దీని ప్రకారం ప్రయాణికుడు టికెట్‌పై కేవలం 45 పైసలు చెల్లిస్తే చాలు.. రూ. 10 లక్షల బీమా కవరేజీ లభిస్తుంది. అయితే దీనిని ప్రయాణికుల ఎంపికకే వదిలివేశారు.ఈ ప్రీమియం తీసుకునే వారు కచ్చితంగా తమ మొబైల్ నంబరును రిజస్టర్ చేయించుకోవాలి. టికెట్ చార్జీతో కలిపి దీనిని వసూలు చేస్తారు. ఈ బీమా పథకంలో భాగంగా రైలు ప్రమాదం లేదా ఏదైనా ఇతర అవాంఛనీయ ఘటనల కారణంగా ప్రయాణికుడు మరణించినా, లేదా తీవ్రంగా గాయపడి, శాశ్వత అంగవైకల్యానికి గురైనా గరిష్ఠంగా రూ.10 లక్షల బీమా అందిస్తారు.

## చైనా మెగా బ్రహ్మపుత్ర డ్యామ్ ప్రాజెక్టుతో ముప్పు



**బీజింగ్ అక్టోబర్ 26 డ్రీమ్ టైమ్స్**

బ్రహ్మపుత్ర నదిపై చైనా తలపెట్టిన 168 బిలియన్ డాలర్ల భారీ జల విద్యుత్ ప్రాజెక్టు వల్ల భవిష్యత్తులో బ్రహ్మపుత్ర నదిలో నీటి ప్రవాహం గణనీయంగా పెరుగుతుందని, దీనివల్ల వరద ముప్పు కూడా అధికమవుతుందని చైనా పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో టిబెట్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఈ మెగా డ్యామ్ ప్రాజెక్ట్‌పై ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, యున్నాన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు టిబెటన్ పీఠభూమిలోని డాటాను ఉపయోగించి 1325 ఏడాది నుంచి 2026 వరకు నదీ ప్రవాహ చరిత్రను పరిశీలించారు.వాతావరణంతో దీనిని అనుసంధానించడం ద్వారా భవిష్యత్తులో రాబోయే పరిస్థితుల్లో నది ప్రవాహం పెరగడంతోపాటు, అధిక ప్రవాహాలు, వరదలు సంభవించే అవకాశాలు ఉన్నట్లు వారు ఒక మోడల్‌ను అభివృద్ధి చేశారు. ఈ అంశానికి సంబంధించిన ఫలితాలు అక్టోబర్ 8న 'చైనా సైన్స్ బులెటిన్'లో ప్రచురితమయ్యాయి.

## మైక్రోసాఫ్ట్‌లో 60 వేల మందికి వీఆర్ఎస్!

**-భారత్ సహా నాలుగు దేశాల్లోని ఉద్యోగులకు అవకాశం**

**-ఏఐపై భారీ పెట్టుబడుల నేపథ్యంలో ఖర్చుల తగ్గింపుపై కంపెనీ దృష్టి**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26 డ్రీమ్ టైమ్స్**




టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సుమారు 60 వేల మంది ఉద్యోగులకు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ఆఫర్‌ను ప్రకటించింది. భారత్, అమెరికా, కెనడా, బ్రిటన్‌లో అర్హులైన ఉద్యోగులకు ఈ పథకం ప్రకటించింది. మైక్రోసాఫ్ట్ మొత్తం ఉద్యోగులు సుమారు 2.23 లక్షలు కాగా, వారిలో దాదాపు 27 శాతం మందికి ఈ ఆఫర్ కల్పించింది. అయితే, అర్హులైన వారందరూ ఉద్యోగాలను వీడతారని కంపెనీ ప్రకటించలేదు.ఇది పూర్తిగా స్వచ్ఛంద కార్యక్రమం. ఈ పథకాన్ని ఎంచుకునే ఉద్యోగులకు వారి ఉద్యోగ స్థాయి, సంస్థలో పనిచేసిన కాలాన్ని బట్టి పరిహారం అందించనున్నారు. కృత్రిమ మేధ, డాటా సెంటర్ల విస్తరణపై మైక్రోసాఫ్ట్ భారీగా పెట్టుబడులు పెడుతున్నది. ఈ నేపథ్యంలో ఖర్చులను నియంత్రిస్తూ, మారుతున్న వ్యాపార అవసరాలకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్యను సర్దుబాటు చేసుకునే ప్రయత్నాల్లో భాగంగానే ఈ పథకం తీసుకొచ్చినట్టు కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ కార్యక్రమం ద్వారా ఎంతమంది ఉద్యోగులు సంస్థను వీడతారనే విషయాన్ని మైక్రోసాఫ్ట్ వెల్లడించలేదు.

## ఈసీల నియామకంలో రాజకీయ జోక్యం ఉండొద్దు'

**ముంబై అక్టోబర్ 26 డ్రీమ్ టైమ్స్**




ఎన్నికల కమిషనర్ల నియామకంలో రాజకీయ ఆధిపత్యం, జోక్యం ఉండొద్దని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఓకా అన్నారు. సోమవారం థాణెలో జరిగిన 'భావప్రకటనా స్వేచ్ఛ-మనం' అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాజ్యాంగ బద్ధమైన సంస్థల మీద రాజకీయ నాయకుల పెత్తనాలు ఉండొద్దని, ప్రజలకు ఆయా సంస్థలపై ఉన్న నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. రాజకీయ జోక్యం ఎన్నికల నిర్వహణనే ప్రశ్నార్థకంగా మార్చేస్తుందని చెప్పారు. అందుకే ఎన్నికల కమిషనర్ల నియామకానికి రాజకీయ జోక్యం ఉండకుండా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగిస్తే ఆ తర్వాత పరిస్థితులు చక్కబడుతాయనేది ప్రశ్నార్థకమే అన్నారు.

## పార్కింగ్ విషయంలో గొడవ.. ముగ్గురి హత్య

**లక్నో:అక్టోబర్ 26 డ్రీమ్ టైమ్స్**



పార్కింగ్ విషయంలో మొదలైన గొడవ చివరకు ముగ్గురి ప్రాణాలు తీసింది. లక్నోలోని సాదత్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నౌబస్తా ప్రాంతంలోని బ్రాహ్మణి తోలా కాలనీలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఈ ఘటన చోటుచేసుకున్నది. ఖాళీ స్థలంలో కారు పార్కింగ్ చేసే విషయంలో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. పొరుగింటిలో ఉండే నేవీలో పనిచేసే రిషబ్ శుక్లా తుపాకీతో కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో శివాజీ తివారీ (65), ఆయన సోదరుడు శివేంద్ర తివారీ (55), ఆయన కొడుకు సుయశ్ తివారీ (30) తీవ్రంగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతూ మరణించారు. ఇదే కాల్పుల్లో గాయపడ్డ మరో వ్యక్తి శంభు పరిస్థితి విషమంగా ఉన్నది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# రక్షణ రంగానికి రూ.2.12 లక్షల కోట్ల బలం!

-భారీ సైనిక కొనుగోళ్లకు రక్షణ కొనుగోళ్ల మండలి ఆమోదం
-రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన కీలక నిర్ణయం
-82 శాతం కొనుగోళ్లు దేశీయ పరిశ్రమల నుంచే
-సైన్యానికి అత్యాధునిక హెలికాప్టర్లు, కామికాజ్ డ్రోన్లు
-నౌకాదళం, వాయుసేన సామర్థ్యం పెంపునకు ప్రాధాన్యం



న్యూఢిల్లీ: దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. త్రివిధ దళాల ఆధునికీకరణ కోసం రూ.2.12 లక్షల కోట్ల విలువైన సైనిక ఆయుధాలు, పరికరాలు, యుద్ధ సామగ్రి కొనుగోలు ప్రతిపాదనలకు రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. సోమవారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సైన్యం, నౌకాదళం, వాయుసేన అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక రక్షణ సామగ్రిని సమకూర్చేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. మొత్తం కొనుగోళ్లలో సుమారు 82 శాతం దేశీయ రక్షణ పరిశ్రమల నుంచే సేకరించాలని నిర్ణయించడం విశేషం. ఈ చర్యతో స్వదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీకి మరింత ప్రోత్సాహం లభించనుంది. దేశీయ పరిశ్రమల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రక్షణ పరికరాల కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదనలను రూపొందించారు. భారత సైన్యం కోసం తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లు, సుదూర లక్ష్యాలను ఛేదించగల కామికాజ్ డ్రోన్ వ్యవస్థలు, అత్యధిక చలన సామర్థ్యం కలిగిన వాహనాలను సమకూర్చనున్నారు. ఈ పరికరాలతో సైనిక దళాల నిఘా, రవాణా, దాడి సామర్థ్యాలు మరింత మెరుగుపడే అవకాశముంది. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో సైనిక కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. భారత నౌకాదళం కోసం శత్రు క్షిపణులను తప్పుదోవ పట్టించే యాక్టివ్ ఆఫ్ బోర్డ్ డికాయ్ వ్యవస్థను సమకూర్చనున్నారు. వాయుసేన అవసరాల కోసం నూతన హెలికాప్టర్ల కొనుగోలుకు ఆమోదం తెలిపారు. తాజా నిర్ణయంతో త్రివిధ దళాల యుద్ధ సన్నద్ధతను పెంచడంతో పాటు దేశీయ రక్షణ తయారీ రంగానికి ఊతం లభించనుంది. అయితే డీఏసీ ఆమోదం కొనుగోలు ప్రక్రియలో ఒక కీలక దశ మాత్రమే. తదుపరి ప్రక్రియలు పూర్తయిన తర్వాతే తుది ఒప్పందాలు కుదరనున్నాయి.

# అవి ఏకగ్రీవాలు కాదు.. బలవంతపు విజయాలు!

మొదటి తరువాయి

అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. నామినేషన్ పత్రాలను చించివేసి, అభ్యర్థులను బెదిరించి పోటీ నుంచి తప్పించారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 16 మున్సిపాలిటీలు, 639 వార్డులు, నాలుగు జెడ్పీటీసీ, 32 ఎంపీటీసీ స్థానాల్లో జరిగిన ఏకగ్రీవాలు ప్రజాభిప్రాయానికి ప్రతిబింబం కాదని వ్యాఖ్యానించారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పునరావృతం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. “ఆనాడు వైసీపీ చేసిందని నేడు మీరు చేస్తారా? వాళ్లు గడ్డి తిన్నారని మీరు అదే తింటారా?” అంటూ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలపై నమ్మకం లేకనే బలవంతపు ఏకగ్రీవాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం తక్షణమే స్పందించి ఏకగ్రీవ ఫలితాలను నిలిపివేయాలని, ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను, ఓటర్ల హక్కులను పరిరక్షించేలా ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని షర్మిల కోరారు.

# కోస్తాంధ్రకు రెడ్ అలర్ట్

మొదటి తరువాయి

ఇది గంటకు 13 కి.మీ. వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నానికి తూర్పు ఆగ్నేయంగా 430 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి మంగళవారం ఉదయానికి అతి తీవ్ర తుఫాన్‌గా బలపడనుంది. బుధవారం తెల్లవారుజాము నాటికి ఉత్తర కోస్తాకు అతి సమీపంగా వచ్చి అదేరోజు ఉదయం విశాఖపట్నం, మచిలీపట్నం మధ్య యానాం వద్ద తీరం దాటనున్నదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. అతితీవ్ర తుఫాన్ తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, అప్పుడప్పుడు 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని హెచ్చరించింది. కాగా, మంగవారం మధ్యాహ్నం తర్వాత అత్యంత తీవ్ర తుఫాన్‌గా మారుతుందని ఇస్రో వాతావరణ నిపుణుడు హెచ్చరించారు.

**మీటరున్నర ఎత్తుకు ఎగసిపడనున్న అలలు**

మంగళవారం రాత్రి నుంచి కాకినాడ, యానాం, కోనసీమ ప్రాంతాల్లో సముద్ర అలలు మీటరు నుంచి మీటరున్నర ఎత్తు వరకు ఎగసిపడతాయని, దీంతో సముద్రం ముందుకు వస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, అల్లూరి జిల్లాలపై పెనుగాలులు, కుంభవృష్టి వర్షాల తీవ్ర ప్రభావం ఉంటుందని, ముఖ్యంగా కాకినాడ, కోనసీమ జిల్లాలు అత్యంత ప్రభావానికి గురవుతాయని వాతావరణ నిపుణుడొకరు పేర్కొన్నారు. మంగళ, బుధవారాల్లో దూరప్రయాణాలు వాయిదా వేసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. తీర ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ సూచించారు. సంద్రంలోని హోప్ ఐలాండ్‌లో నివాసముంటున్న 130మంది మత్స్యకారులను కాకినాడ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం తూరంగిలోని తుఫాను షెల్టర్‌లోకి తరలించారు.

**స్కూళ్లకు సెలవులు..**

తుఫాను నేపథ్యంలో ఉభయగోదావరి, విశాఖ, కాకినాడ, కోనసీమ, కృష్ణా, విజయనగరం, ఎన్టీఆర్, బాపట్ల, ఏలూరు, శ్రీకాకుళం జిల్లాల్లో పాఠశాలలకు మంగళ, బుధవారాలు సెలవులు ప్రకటించారు. అనకాపల్లి జిల్లాలో మాత్రం గురువారం కూడా సెలవు ఇచ్చారు.

**బీచ్‌లు తాత్కాలికంగా మూసివేత**

బాపట్ల జిల్లా పరిధిలోని సూర్యలంక, రామాపురం, ఓడరేవు బీచ్‌లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. మంగళవారం నుంచి తదుపరి ఆదేశాలు వెలువడే వరకు సముద్రతీర ప్రాంతాలకు సందర్శకులకు అనుమతి లేదన్నారు.

**నేడు, రేపు అతిభారీ వర్షాలు**

కోస్తాంధ్రలో పలుచోట్ల సోమవారం వర్షాలు కురిశాయి. మంగళవారం అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు జిల్లాల్లో కుంభవృష్టి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అల్లూరి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అతిభారీగా, కోస్తాంధ్రలోని మిగిలిన జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయి. బుధవారం విశాఖ, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, ఉభయ గోదావరి, కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కుంభవృష్టి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, బాపట్ల జిల్లాల్లో అతిభారీగా, కోస్తాంధ్రలోని మిగిలిన జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

# సిరీస్ వేటలో శ్రేయస్ సేన..

-నేడు న్యూజిలాండ్‌తో మూడో టీ20
- 2-0 ఆధిక్యంతో జోరుమీదున్న టీమిండియా
- గాయంతో ఇషాన్ కిషన్ దూరం.. వైభవ్ సూర్యవంశీకి మరో ఛాన్స్
- హైదరాబాదీ తిలక్ వర్మ, నితీశ్ రెడ్డిపై భారీ ఆశలు
- బౌలింగ్‌లో పుంజుకోవాల్సిన భువనేశ్వర్ కుమార్
- గాయాలతో కివీస్‌కు ఎదురుదెబ్బ.. హెన్రీ, ఫెర్గుసన్ దూరం
- బౌలర్లు, ఫీల్డర్లకు సవాల్‌గా వెల్లింగ్టన్ ఈదురుగాలులు
- మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రసారం




వెల్లింగ్టన్, స్పోర్ట్స్ డెస్క్

న్యూజిలాండ్ గడ్డపై వరుస విజయాలతో దూసుకెళ్తున్న భారత జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇప్పటికే 2-0 ఆధిక్యంలో ఉన్న శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమిండియా మూడో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. మంగళవారం వెల్లింగ్టన్ వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడో టీ20 జరగనుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో అద్భుత ప్రదర్శనతో విజయాలు అందుకున్న భారత జట్టు అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. మరోవైపు వరుస పరాజయాలతో ఒత్తిడిలో ఉన్న ఆతిథ్య న్యూజిలాండ్‌కు ఈ మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. మూడో టీ20లోనూ ఓడితే మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్‌ను కోల్పోవాల్సి వస్తుంది. దీంతో ఎలాగైనా గెలిచి సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలని కివీస్ పట్టుదలతో ఉంది. అయితే కీలక మ్యాచ్‌కు ముందు భారత జట్టుకు ఇషాన్ కిషన్ గాయం రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. తొడకండరాల గాయంతో బాధపడుతున్న ఇషాన్ మూడో టీ20కు కూడా దూరమయ్యాడు. తొలి మ్యాచ్‌లో గాయపడిన అతడిని రెండో టీ20లో ఆడించని జట్టు యాజమాన్యం.. పూర్తిగా కోలుకోకపోవడంతో మూడో మ్యాచ్‌కూ విశ్రాంతినిచ్చింది. దీంతో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం దక్కనుంది. రెండో టీ20లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన వైభవ్ ఈసారి తన ప్రతిభను నిరూపించుకోవాలని భావిస్తున్నాడు. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజు శాంసన్ మరోసారి శుభారంభం అందించేందుకు సిద్ధమయ్యారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మిడిలార్డర్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ముఖ్యంగా హైదరాబాదీ యువ బ్యాటర్ తిలక్ వర్మపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రెండో టీ20లో అజేయ అర్ధసెంచరీతో జట్టును విజయతీరాలకు చేర్చిన తిలక్ అదే ఫామ్‌ను కొనసాగించాలని చూస్తున్నాడు. మరో తెలుగు యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కూడా గత మ్యాచ్‌లో కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. వీరిద్దరూ మరోసారి రాణిస్తే భారత బ్యాటింగ్ మరింత బలపడనుంది. నమన్ ధీర్, అక్షర్ పటేల్ రూపంలో జట్టుకు అదనపు బ్యాటింగ్ బలం ఉంది. అయితే బౌలింగ్ విభాగంలో స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్ పుంజుకోవాల్సిన అవసరం ఉంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో భారీగా పరుగులు సమర్పించుకున్న అతడు వికెట్లు సాధించడంలోనూ విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌లో భువనేశ్వర్‌తోపాటు అర్ష్‌దీప్ సింగ్, ఇతర బౌలర్లు సమష్టిగా రాణించాల్సి ఉంది. మరోవైపు న్యూజిలాండ్ జట్టును గాయాల సమస్య వేధిస్తోంది. ప్రధాన పేసర్లు మాట్ హెన్రీ, లోకీ ఫెర్గుసన్ గాయాలతో మూడో టీ20కు దూరమయ్యారు. వీరి స్థానాల్లో బ్లెయిర్ టిక్నర్, కైల్ జేమీసన్‌లను జట్టులోకి తీసుకున్నారు. దీంతో ఆతిథ్య జట్టు బౌలింగ్ విభాగంలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇక వెల్లింగ్టన్‌లో వీచే బలమైన ఈదురుగాలులు ఇరు జట్లకు మరో సవాల్‌గా మారనున్నాయి. ముఖ్యంగా బౌలింగ్ సమయంలో బంతి నియంత్రణ, ఫీల్డింగ్‌లో క్యాచ్‌లు అందుకోవడంపై గాలుల ప్రభావం పడే అవకాశముంది. ఈ పరిస్థితులకు త్వరగా అలవాటు పడే జట్టుకే మ్యాచ్‌లో పైచేయి సాధించే అవకాశం ఉంటుంది. బ్యాటింగ్‌కు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడితే భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశమూ ఉంది. మొత్తంగా సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో భారత్, పరువు నిలబెట్టుకోవాలనే పట్టుదలతో న్యూజిలాండ్ బరిలోకి దిగుతుండటంతో మూడో టీ20పై ఆసక్తి నెలకొంది.

అంచనా తుది జట్లు:

భారత్: అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), వైభవ్ సూర్యవంశీ, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి/ప్రిన్స్ యాదవ్.

న్యూజిలాండ్: ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్ (వికెట్ కీపర్), డెవాన్ కాన్వే/జీవన్ జాకబ్స్, గ్లెన్ ఫిలిప్స్, డారిల్ మిచెల్, మైకేల్ బ్రేస్‌వెల్, మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), కైల్ జేమీసన్, ఆడమ్ మిల్నే, జాకబ్ డఫీ, బ్లెయిర్ టిక్నర్.

# ప్రాణనష్టం జరగొద్దు!

మొదటి తరువాయి

సమీక్షలో తుపాను తీవ్రత, భారీ వర్షాలు, పెనుగాలులు, వరద ముప్పు, సహాయక చర్యలపై చర్చించారు. తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు నిరంతరం హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. తుపాను ప్రభావంతో కురిసే వర్షాలు, వీచే గాలులు, సంభవించే వరద ప్రవాహాలను ముందుగానే అంచనా వేయాలని చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. గతంలో సంభవించిన తుపానుల సమాచారాన్ని విశ్లేషించి ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించారు. ముఖ్యంగా తీరప్రాంత గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు అవసరమైన చోట్ల ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. తుపాను ఆశ్రయ కేంద్రాలను సిద్ధంగా ఉంచి ప్రజలకు అవసరమైన వసతులు కల్పించాలని పేర్కొన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలుగా పేర్కొన్న వివరాల ప్రకారం అక్టోబర్ 26 అర్ధరాత్రికి తుపాను తీవ్రరూపం దాల్చి, 27వ తేదీ నాటికి మరింత బలపడే అవకాశముందని అధికారులు సమీక్షలో వివరించారు. అక్టోబర్ 28 ఉదయం బాపట్ల నుంచి విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవచ్చని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. అయితే తుపాను పేరు, తీరం దాటే ప్రాంతం, గాలుల వేగానికి సంబంధించిన ఈ అంచనాలను తాజా అధికారిక వాతావరణ బులెటిన్‌తో నిర్ధారించుకోవాల్సి ఉంది. అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో తీరప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని, రైతులు తమ పంటలు, వ్యవసాయ సామగ్రిని రక్షించుకునేందుకు అవసరమైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. విపత్తు సమయంలో వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు వర్చువల్ విధానంలో హాజరై తమ జిల్లాల్లో చేపడుతున్న ముందస్తు చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. తుపాను ముప్పు పూర్తిగా తొలగే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వవద్దని చంద్రబాబు ఆదేశించారు.

# ట్రంప్ ఆదేశిస్తే 96 గంటల్లో ఇరాన్‌పై దాడులు!




న్యూయార్క్:
పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు జారీ చేస్తే కేవలం 96 గంటల్లోనే ఇరాన్‌పై సైనిక దాడులు ప్రారంభించేందుకు అమెరికా బలగాలు సిద్ధంగా ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇరాన్‌లోని కీలక సైనిక స్థావరాలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలు, రాడార్ వ్యవస్థలు, అణు కేంద్రాలతోపాటు ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకునేలా అమెరికా సైనిక వ్యూహాలను రూపొందించినట్లు సమాచారం. పశ్చిమాసియాలో ఇప్పటికే పెద్ద సంఖ్యలో అమెరికా బలగాలను మోహరించామని ఇద్దరు అధికారులు సీఎన్ఎన్‌కు వెల్లడించినట్లు కథనం పేర్కొంది. అయితే దాడులు ప్రారంభించాలా, వద్దా అనే తుది నిర్ణయం పూర్తిగా అధ్యక్షుడు ట్రంప్ చేతుల్లోనే ఉందని వారు స్పష్టం చేసినట్లు తెలిపింది. అమెరికా సైన్యం ఇరాన్‌పై విస్తృత స్థాయిలో దాడులు నిర్వహించేందుకు అవసరమైన సన్నాహాలు చేస్తున్నట్లు ఆ కథనం వెల్లడించింది. గతంలో మాదిరిగా కొన్ని పరిమిత లక్ష్యాలకే కాకుండా ఈసారి ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని ప్రభావితం చేసే పలు కీలక కేంద్రాలను లక్ష్యంగా చేసుకునే అవకాశముందని పేర్కొంది. ముఖ్యంగా రాడార్ వ్యవస్థలు, క్షిపణి ప్రయోగ వేదికలు, సైనిక స్థావరాలు, అణు సంబంధిత కేంద్రాలపై దృష్టి సారించినట్లు తెలిపింది. ఇంధన మౌలిక సదుపాయాలు కూడా సంభావ్య లక్ష్యాల జాబితాలో ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్‌కు సంబంధించిన వివరాలను ఉటంకిస్తూ పేర్కొంది. అయితే సైనిక చర్యకు సంబంధించి అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటివరకు తుది ఆదేశాలు జారీ చేయలేదని అధికారులు వెల్లడించినట్లు సమాచారం. ఈ ఏడాది చివరిలోగా ఎప్పుడైనా ఆదేశాలు వచ్చే అవకాశం ఉందని, ముఖ్యంగా అమెరికా మధ్యంతర ఎన్నికల అనంతరం కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలను తోసిపుచ్చలేమని వారు అభిప్రాయపడినట్లు కథనం తెలిపింది. ఎన్నికల తర్వాత అనుసరించాల్సిన సైనిక వ్యూహంపై ట్రంప్ ఇంకా స్పష్టమైన నిర్ణయానికి రాలేదని పేర్కొంది. మరోవైపు అమెరికా సైనిక కదలికలు, వ్యూహాలను ఇరాన్ దళాలు గమనిస్తున్నాయని అమెరికా అధికారులు అంగీకరించినట్లు కథనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో దాడుల ప్రణాళికలను మరింత విస్తృతంగా రూపొందిస్తున్నట్లు పెంటగాన్ వర్గాలను ఉటంకిస్తూ తెలిపింది. అయితే అమెరికా సైనిక సన్నద్ధతపై వెలువడిన ఈ వివరాలకు సంబంధించి వైట్‌హౌస్ అధికారికంగా స్పందించలేదు. ఇరాన్‌పై అమెరికా మరోసారి సైనిక చర్యకు దిగే అవకాశాలపై వస్తున్న కథనాలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచుతున్నాయి. అయితే 96 గంటల్లో దాడులు ప్రారంభించగలమన్నది అధికారులను ఉటంకిస్తూ వెలువడిన నివేదికలోని అంశమే తప్ప, దాడులకు ట్రంప్ ఆదేశాలు ఇచ్చినట్లు అధికారిక ధ్రువీకరణ వెలువడలేదు.

# జనగణన వివరాలు బయటపెట్టొద్దు!

న్యూఢిల్లీ, నేషనల్ డెస్క్

దేశవ్యాప్తంగా 2027 జనాభా లెక్కల సేకరణ సందర్భంగా ప్రజల నుంచి సేకరించే వ్యక్తిగత సమాచారం, గణాంకాల గోప్యత విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. జనగణన ప్రక్రియలో సేకరించిన వివరాలను మీడియాకు విడుదల చేయరాదని, అనుమతి లేకుండా ఇతర అవసరాలకు వినియోగించరాదని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) స్పష్టం చేసింది. ఈ మేరకు జనగణన కమిషనర్ మృత్యుంజయ కుమార్ నారాయణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. జనాభా లెక్కల సేకరణలో ప్రజలు అందించే సమాచారం అత్యంత గోప్యమైనదని, దాని రక్షణకు ప్రత్యేక చట్టపరమైన నిబంధనలు ఉన్నాయని తెలిపారు. 1948 జనగణన చట్టం ప్రకారం సేకరించిన వ్యక్తిగత వివరాలను బహిర్గతం చేయడానికి వీల్లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జనగణనకు సంబంధించిన వ్యక్తిగత రికార్డులను ఎవరూ తనిఖీ చేయడానికి అనుమతి ఉండదని, వాటిని న్యాయస్థానాల్లో సాక్ష్యాలుగా కూడా పరిగణించరాదని వివరించారు. జనగణన ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమాచార గోప్యతను కచ్చితంగా పాటించాలని సూచించారు. మరోవైపు 2027 జనాభా లెక్కల సేకరణను పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు తమ మొబైల్ ఫోన్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి కేంద్ర సర్వర్‌కు పంపించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు లేదా ఇంటర్నెట్ కనెక్టివిటీ అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో కాగితపు షెడ్యూళ్ల ద్వారా సమాచారాన్ని సేకరించేందుకు అవకాశం కల్పించారు. డిజిటల్ విధానంతో సమాచార సేకరణ, నిర్వహణ ప్రక్రియను సులభతరం చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించారు.

# మలేరియా టీకా ధర భారీగా తగ్గింపు.

న్యూఢిల్లీ, నేషనల్ డెస్క్

మలేరియా మహమ్మారి నుంచి చిన్నారులను రక్షించడం కోసం భారత్ బయోటెక్ కంపెనీ కీలక ముందడుగు వేసింది. అంతర్జాతీయ సంస్థలు ‘గవి ’, ‘యునిసెఫ్ తో కలిసి మలేరియా వ్యాక్సిన్ ధరను దాదాపు 40 శాతం తగ్గించేందుకు భారత్ బయోటెక్ ఒప్పందం కుదుర్చుకుంది. దాంతో ప్రస్తుతం ఒక్క డోసుకు 9.30 యూరోలుగా ఉన్న ధర 5.50 యూరోలకు తగ్గనుంది. భారత కరెన్సీ లో ఇది సుమారు రూ.600 లోపే ఉంటుంది.ఈ తగ్గింపు ధర 2027 ప్రారంభం నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో 2027-2029 మధ్య చిన్నారుల టీకా కార్యక్రమాలకు దాదాపు 50 మిలియన్ డాలర్లు ఆదా కానున్నాయి. ఈ నిధులతో మరో 10 లక్షల మంది పిల్లలకు మలేరియా వ్యాక్సిన్ అందించవచ్చని అంచనా. భారత్ బయోటెక్ ఈ వ్యాక్సిన్‌ను ‘మాస్కివాక్’ పేరుతో తయారు చేస్తున్నది. దీని అసలు పేరు ఆర్‌టీఎస్, ఎస్/ఏఎస్01. జీఎస్‌కే, పాత్ సంస్థలు, వాటి భాగస్వాములు ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశాయి. 2021లో ప్రపంచ ఆరోగ్య సంస్థ చిన్నారుల్లో మలేరియా నివారణ కోసం విస్తృత వినియోగానికి ఈ వ్యాక్సిన్‌ను సిఫారసు చేసింది. ప్రస్తుతం దీని తయారీ బాధ్యతలను జీఎస్‌కే నుంచి భారత్ బయోటెక్‌కు బదిలీచేసే ప్రక్రియ కొనసాగుతున్నది. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, మరిన్ని దేశాలకు వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకురావడం దీని ప్రధాన లక్ష్యం. ఈ వ్యాక్సిన్‌ను నాలుగు డోసుల కోర్సుగా ఇస్తారు. మలేరియా వ్యాప్తి కాలానుగుణంగా ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సరైన సమయంలో నాలుగు డోసులు తీసుకుంటే మలేరియా కేసులు సుమారు 75 శాతం తగ్గే అవకాశం ఉందని యునిసెఫ్ తెలిపింది. అయితే ఈ వ్యాక్సిన్ పూర్తిస్థాయి రక్షణ ఇవ్వదు. దోమతెరలు వాడటం, దోమల నియంత్రణ చర్యలు చేపట్టడం, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం కూడా అవసరం. ప్రపంచవ్యాప్తంగా 2024లో సుమారు 28.2 కోట్ల మలేరియా కేసులు నమోదయ్యాయి.

# సంపాదకీయం

## వైటీపీఎస్‌పై సోయిలేని సర్కార్



రామగుండం ప్లాంటును 2020లో స్క్రాప్ చేశారు. అక్కడే ప్రస్తుత 800 మెగావాట్ల ప్లాంటును నిర్మించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం మనకు రావాల్సిన 450 మెగావాట్ల దిగువ సీలేరును కేంద్ర ప్రభుత్వం అన్యాయంగా ఆంధ్రకు కేటాయించిన ఏడు మండలాల్లో భాగంగా తరలిపోయింది. నెల్లూరులోని దామోదరం సంజీవయ్య థర్మల్ స్టేషన్ నుంచి మనకు రావాల్సిన 440 మెగావాట్లు రాకుండా నిలిపివేశారు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు. మొత్తంగా తెలంగాణకు రావాల్సిన 890 మెగావాట్లు రాకుండా పోయింది. తెలంగాణ ప్రజలు, రైతులు, పారిశ్రామికవేత్తలు, కరెంట్ కోతలతో అల్లాడిపోతున్న నేపథ్యంలో జెన్‌కోను పరిపుష్టం చేసి విద్యుత్తు ఉత్పత్తి విషయంలో స్వయం సమృద్ధి సాధించడానికి చేపట్టిన ప్రాజెక్టు యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్. ఈ ప్రాజెక్టును నల్లగొండ జిల్లా దామరచర్లలో నెలకొల్పే నిర్ణయం తీసుకోవడానికి ముందు పాండురంగాపురం, పునుకుడు చెల్క గ్రామాలను ప్రభుత్వం పరిశీలించింది. ఇవి కేటీపీఎస్‌కు సమీపంలోనే ఉండడం, కిన్నెరసాని అభయారణ్యం కావడంతో పరిగణనలోకి తీసుకోలేదు. అంతేకాకుండా వ్యవసాయ యోగ్యం కాని భూమి అందుబాటులో లేకపోవడం పర్యావరణ, అటవీ అనుమతులు పొందడానికి అనుకూలంగా లేకపోవడం మరొక కారణం. దామరచర్ల ప్రాంతాన్ని ఎంపిక చేయడానికి ప్రధాన కారణాల్లో వ్యవసాయ యోగ్యంకాని 4,576 ఎకరాల భూమి అందుబాటులో ఉండడం. కేవలం 5 కిలో మీటర్ల దూరంలోనే కృష్ణానది ఉండడం. అవసరమైన యంత్రాలను దిగుమతి చేసుకోవడానికి సమీపంలో కాకినాడ నౌకాశ్రయం ఉండడం. 7 కిలోమీటర్ల దూరంలోనే నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి. 5 కి.మీలో విష్ణుపురం రైల్వేస్టేషన్ ఉండడం. కేంద్ర పర్యావరణ అటవీ నోటిఫికేషన్‌లో ఈ ప్రాంతం క్యాటగిరీ 'ఏ'లో ఉండడంతో పర్యావరణ, అటవీ అనుమతులు సులభతరం అయ్యాయి. ఉత్పత్తి కేంద్రం నుంచి వెలువడే వ్యర్థాలు, ఫ్లైయాష్‌ను ముడిసరుకుగా వాడుకునే సిమెంట్ కర్మాగారాలు సుమారు 22కు పైగా ఇదే ప్రాంతంలో ఉన్నాయి. విద్యుత్తు డిమాండ్‌కు అతి సమీపంలోనే ప్లాంటును నిర్మించడం, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్, పరిసర ప్రాంతాలకు 150 కి.మీ. లోపే ఉన్నది. ప్రస్తుతం ఉన్న థర్మల్ ప్లాంట్లు హైదరాబాద్ నగరానికి, డిమాండ్‌కు సుమారు 300 కిలోమీటర్లకు పైగా దూరంలో గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోనే ఉన్నాయి. రామగుండం ప్రాంతంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఇప్పటికే 8,000 మెగావాట్ల సామర్థ్యం గల పవర్ ప్లాంట్లు ఒకే దగ్గర కేంద్రీకృతమై ఉన్నాయి. డిమాండ్‌కు దూరంగా ఒకేచోట నిర్మించడం సహేతుకం కాదు. ఇక్కడ 7 ఉపరితల గనులు, 13 భూగర్భ గనులు, 1,200 మెగావాట్ల సింగరేణి ఉత్పత్తి కేంద్రం, సిమెంట్ ఫ్యాక్టరీ, ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటి పరిశ్రమల వలన సుమారు నలభై మిలియన్ టన్నుల బొగ్గు మండుతున్నది. వీటికి తోడు కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ 1,800 మె.వా, కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ 1,100 మె.వా, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ 1,080 మె.వా, సింగరేణి ఆధ్వర్యంలోని జైపూర్ పవర్ ప్లాంట్లు అన్నీ గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోనే ఉన్నాయి. ఎప్పుడైనా ప్రకృతి విపత్తు సంభవిస్తే, గ్రిడ్ భద్రతా దృష్ట్యా కూడా ఇతర ప్రాంతాల్లో ప్రాజెక్టును నెలకొల్పడం అవసరం. కర్నాటకలోని రాయచూర్, బళ్లారి, ఏపీలోని విజయవాడ నార్ల తాతారావు పవర్ స్టేషన్, రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్, కడప జిల్లా మద్దునూరు పిట్‌హెడ్ ప్లాంట్లు కావనే విషయం గమనార్హం. కానీ కృష్ణా పరివాహక ప్రాంతమైన దామరచర్లలో విధానపరమైన భద్రత దృష్ట్యా నిర్మించిన ప్రాజెక్టుగా వైటీపీఎస్‌ను చూడాలి. కేటీపీఎస్‌కు జీ10/జీ11 గ్రేడ్, భద్రాద్రి థర్మల్ ప్లాంటుకు జీ9/జీ10 గ్రేడ్, యాదాద్రి థర్మల్ ప్లాంటుకు జీ9 గ్రేడ్ బొగ్గును కేటాయిస్తూ సింగరేణి, జెన్‌కు మధ్య ఒప్పందం కుదిరింది. యాదాద్రి ప్లాంటులోని బాయిలర్లు నాణ్యమైన 'ఫ్యూయల్ ఫ్లెక్సీ బాయిలర్లు'. వీటి గ్రాస్ కెలోరిఫిక్ వాల్యూ 3,300-5,500 కిలో కేలరీల బొగ్గును ఉపయోగించుకునే విధంగా బాయిలర్లను డిజైన్ చేశారు. బాయిలర్లను దేశీయ బొగ్గు, విదేశీ బొగ్గు లేదా రెండింటి మిశ్రమం ద్వారా కూడా మండించవచ్చు. సింగరేణి సరఫరా చేస్తున్న నాసిరకం బొగ్గు వలన 2024 ఏప్రిల్ నుంచి 2026 జూన్ వరకు 27 నెలల్లో 9,593 మి.యూ ఉత్పత్తి నష్టం జరిగినట్టు జెన్‌కో చెప్తున్నది. అయితే, ఇది సింగరేణి బొగ్గు గనుల ఓవర్ బర్డెన్ ఎక్కువగా ఉండడం ధరల్లో వ్యత్యాసానికి కారణం కావచ్చు. వైటీపీఎస్‌ను బీహెచ్ఈఎల్ నిర్మిస్తున్నది. ఎన్టీపీసీ పవర్ ప్లాంట్లు, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో అదానీ కంపెనీ నిర్మిస్తున్న పవర్ ప్లాంట్లు కూడా బీహెచ్ఈఎల్ ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. వైటీపీఎస్ డిజైన్ కన్సల్టెంట్‌గా టాటా కన్సల్టెంట్ ఇంజినీర్స్ కంపెనీ ఉన్నది. ఈ జూన్ మొదటివారంలో జెన్‌కో విజ్ఞప్తి మేరకు ఎన్టీపీసీ నిపుణుల బృందం సందర్శించి డిజైన్‌లో ఎలాంటి లోపాలు లేవని నివేదికలో పేర్కొనట్టు సమాచారం. బొగ్గు పొడిని ఎప్పటికప్పుడు క్లియర్ చేయడం టెయిల్ పుల్లీలు, ఐడ్లర్లు పూర్తిగా బొగ్గు పొడిలో మునిగిపోయి ఉండడం వలన రాపిడికి కన్వేయర్లు, పుల్లీలు చెడిపోతున్నాయని చెప్పినట్టు తెలుస్తున్నది. చిన్న చిన్న కమీషనింగ్ లోపాలను సరిచేసుకుంటూ కన్వేయర్ సిస్టంను 2,500 టీపీహెచ్ పూర్తి సామర్థ్యంలో నడిపించవచ్చని నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. అదేవిధంగా నూరు శాతం సింగరేణి బొగ్గును వినియోగించినప్పుడు అధికంగా బూడిద వెలువడే అవకాశం ఉన్నదని, ఆ కారణంగానే యాష్ డిస్పోజబుల్ సిస్టం కూడా 3,300 జీసీవీకి తగినట్టు డిజైన్ చేసినట్టు నివేదికలో పొందుపర్చారు. అందులో భాగంగానే బాటం యాష్ హాపర్ (బీఏహెచ్)ను మూడు 'వీ'ల ఆకారంలో డిజైన్ చేశారు. దీని వలన బూడిదను డిస్పోజ్ చేయడం సులభతరం అవుతుంది. కన్వేయర్ సిస్టంలోని 'ఛూట్' అలైన్మెంట్లు మార్చుకోవడం, బొగ్గు నిల్వలను స్థిరపరచుకోవడం లాంటి సూచనలతో పాటు యాష్ హ్యాండ్లింగ్ ప్లాంటు బాగుందని పేర్కొన్నట్లు తెలుస్తున్నది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పూర్తి సామర్థ్యం మేరకు సిబ్బందిని, ఇంజినీర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించడం, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మార్గదర్శకాల ప్రకారం బొగ్గు నిల్వలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజోపయోగకరంగా మలచుకోవాలి. ఎల్‌నినోతో దేశవ్యాప్తంగా కరెంట్‌కు కరువు ఏర్పడిన ప్రస్తుత కాలంలో 4,000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు అందుబాటులోకి రావడం ఆషామాషీ కాదు. మార్కెట్లో యూనిట్ రూ.15 పెట్టినా దొరుకని పరిస్థితుల్లో.. తమిళనాడు రూ.37కు కొనుగోలు చేస్తున్న గడ్డుకాలంలో రూ.6.65కే యూనిట్ లభించే యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విలువ అమూల్యం. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైటీపీఎస్‌ను సమర్థవంతంగా వినియోగించుకోకుండా కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు యోచించడం ఎంతవరకు సమంజసం? ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం వద్ద సరైన ప్రణాళిక లేదు. విద్యుత్తు ఉత్పత్తిలో అంతరాయాలు, ప్రత్యామ్నాయాల ఏర్పాట్లపై ఆలోచించలేదు. దీంతో లేకపోవడం తో రైతులు విలవిల్లాడుతున్నారు. వైటీపీఎస్ పట్ల అలసత్వ మే ప్రభుత్వం వైఫల్యానికి నిదర్శనం.

# లోపాల ఆసరాతో 'సైబర్' దోపిడీ



హైదరాబాద్ లోని ఒక నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బిఎఫ్‌సి) కంప్యూటర్ వ్యవస్థ లోని లోపాలను ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్లు సుమారు రూ. 3.34 కోట్లను అక్రమంగా బదిలీ చేయడం సంచలనం కలిగించింది. ఈ అక్రమ వ్యవహారం సమాచారం సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు అందిన తర్వాత కేవలం రూ. 40 లక్షలను మాత్రమే నిలిపివేయగలిగారు. కంపెనీకి చెందిన కంప్యూటర్ వ్యవస్థలు లేదా ఎపిఐలు (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేసెస్) అనుమతి లేకుండా అనుసంధానం అయి ఉండవచ్చని, లేదా వాటి లోని లోపాలను దుర్వినియోగం చేసి ఉండవచ్చని, ఆ విధంగా అనధికారికంగా డబ్బు బదిలీలు జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఎపిఐ అనేది రెండు సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు పరస్పరం సమాచారాన్ని మార్పిడి చేసుకోవడానికి, నిర్దిష్ట పనులను నిర్వహించడానికి ఉపయోగించే సాంకేతిక మార్గం. అలాంటి వ్యవస్థ లోకి అనధికారికంగా ప్రవేశిస్తే తగిన భద్రతా నియంత్రణలు ఉండవు సరికదా, చెల్లింపులు దుర్వినియోగమవుతాయి. ఈ ఎన్‌బిఎఫ్‌సి కంప్యూటర్ సిస్టమ్ లాగ్‌లు, ఎపిఐ లాగ్‌లు, బ్యాంకు స్టేట్‌మెంట్లు, లావాదేవీల రికార్డులు, కంపెనీ అంతర్గత నివేదికలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ సంఘటన నుంచి ఫైనాన్స్ కంపెనీలు, బ్యాంకులు, డిజిటల్ చెల్లింపుల సంస్థలు ఎలాంటి భద్రత పాటించాలో తెలుసుకోవలసి ఉంది. ఎపిఐ భద్రత, బహుళ స్థాయి ధ్రువీకరణ, ఒక్కసారిగా జరిగే అసాధారణ లావాదేవీలపై నిరంతర పర్యవేక్షణ , నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయడం ముఖ్యం. ఇలాంటి సైబర్ నేరాలు ఇటీవల పెరిగాయని గూగుల్ థ్రెట్ ఇంటెలిజెన్స్ గ్రూపు నిపుణులు కొద్ది రోజుల క్రితం హెచ్చరించిన సంగతి ఇప్పుడు గుర్తు తెచ్చుకోవలసి ఉంటుంది. ప్రముఖ కంపెనీల ఎఐ సేవల లాగిన్ వివరాలను దొంగిలించి, కార్పొరేట్ సర్వర్ల లోకి చొరబడి, వాటి కంప్యూటింగ్ సామర్థ్యాలను వినియోగించుకుంటున్నారని గూగుల్ హెచ్చరించింది. ఇక్కడ హైదరాబాద్‌లో కూడా ఎన్‌బిఎఫ్‌సి కంప్యూటర్ వ్యవస్థ లోపాలే సైబర్ నేరగాళ్లకు ఆసరా అయ్యాయి. 20192025 వరకు 67.32 లక్షల సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. వీటిలో రెండింట మూడొంతులు అంటే 43.22 లక్షల కేసులు గత రెండేళ్ల లోనే నమోదు కావడం విశేషం.

గత ఆరేళ్లలో సైబర్ మోసాల ద్వారా సుమారు రూ. 55,000 కోట్లు బాధితులు నష్టపోయారు. ఈ నష్టాల్లో దాదాపు 8 శాతం సైబర్ అరెస్ట్ మోసాలకు సంబంధించినవి. అదే విధంగా ట్రేడింగ్‌కు సంబంధించిన మోసాలు కూడా పెరుగుతున్నాయి. వ్యక్తిగత స్థాయిలో జరిగే ఆర్థిక నష్టాలతోపాటు దేశానికి వ్యతిరేకంగా శత్రుదేశాలు సాగిస్తున్న డిజిటల్ యుద్ధం కారణంగా ప్రభుత్వ సంస్థలు తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. విమానాశ్రయాలు, ప్రాజెక్టులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు వంటి కీలకమైన మౌలిక సదుపాయాల వ్యవస్థలు పొరుగు దేశాల నుంచి నిరంతరం సైబర్ దాడుల ముప్పును ఎదుర్కొంటున్నాయి. రోజురోజుకూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుండగా, అంతకన్న వేగంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. కృత్రిమ మేధ సహాయంతో జరిగే సైబర్ దాడులను గుర్తించడం, వాటిని నివారించడం చాలా కష్టంగా మారుతోంది. సైబర్ నేరగాళ్లు సైబర్ సెక్యూరిటీ కనిపెట్టలేని విధంగా నిరంతరం తమ కోడ్‌ను మార్చుకునే మాల్‌వేర్‌ను సృష్టిస్తున్నారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న ఎఐ టూల్స్ సహాయంతో సాఫ్ట్‌వేర్ లోని లోపాలను అందరి కన్నా ముందుగా పసిగట్టి దాడులకు పాల్పడుతున్నారు. సైబర్ ముప్పులను నివారించడానికి ప్రభుత్వం అనేక ఆవిష్కరణలను ప్రవేశపెట్టింది. ఇండియా ఎఐ మిషన్‌తోపాటు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్‌టీమ్ (సిఇఆర్‌టిఇన్) వ్యవస్థను బలోపేతం చేసింది. సైబర్ దాడుల నుండి డేటాను కాపాడుకోవడానికి సిఇఆర్‌టిఇన్ వంటి ప్రభుత్వ సంస్థలు భద్రతా లోపాలను గంటల వ్యవధిలోనే పరిష్కరించాలన్న నిబంధనలు తీసుకు వచ్చారు. ఏ దేశంపై ఆధారపడకుండా స్వంతంగా కృత్రిమ మేధ సాంకేతికతను భారత్ అభివృద్ధి చేస్తోంది. రూ. 10,300 కోట్లకు పైగా బడ్జెట్‌తో ఇండియా ఎఐ మిషన్‌ను కేంద్రం ప్రారంభించింది. లక్షలాది మందికి ఉపయోగపడేలా జిపియు కంప్యూటింగ్ (గ్రాఫింగ్ ప్రోసెసింగ్ యూనిట్), స్టార్టప్ ఫండింగ్ వ్యవస్థలను అందుబాటు లోకి తెస్తోంది. ఇన్ని ప్రయత్నాలు జరుగుతున్నా సైబర్ దాడులు వ్యూహాత్మకంగా జరుగుతుండడం విచారకరం.

# కాక్రోచ్‌ల శాంతి, మోదీ హింస!

**భారతదేశ ప్రజలకు, ప్రపంచానికి ఒక విషయం ఈ సరికి స్పష్టమైపోయింది. కాక్రోచ్‌లది పూర్తిగా శాంతిమార్గం. మోదీ ప్రభుత్వానికి పూర్తి హింసామార్గం. ఈ విషయాన్ని దేశ విదేశాల్లోని వ్యాఖ్యాతలు అనునిత్యం ఎత్తిచూపుతుండగా, ఐక్యరాజ్య సమితి వంటి సంస్థ సైతం అసాధారణ రీతిలో కేవలం పన్నెండు రోజుల్లో మూడుసార్లు ఇక్కడ హక్కుల అణచివేత గురించి మాట్లాడింది. మోదీ ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడికి లోనవుతూ దీనినంతా నిరాకరిస్తూనే, మరొకవైపు తన అణచివేతలను యథాప్రకారం కొనసాగిస్తున్నది. ఇదొక క్లాసిక్ నియంతృత్వం వంటిది. అకడమిక్ పరిభాషలో చెప్పాలంటే 'ఎన్నికైన నియంతృత్వం' (ఎలెక్టెడ్ ఆటోక్రసీ) అన్నమాట. ఈ తరహా వ్యవస్థల్లో ఎన్నికలు జరుగుతాయి. స్వేచ్ఛగా కావచ్చు, కాకపోవచ్చు కానీ జరుగుతాయి. 'సర్' వంటి ప్రక్రియ ద్వారా నకిలీ ఎన్నికలు అయినా సరే. అప్పుడది నామ్ కే వాస్తే ప్రజాస్వామ్య ప్రక్రియగా ఒక తంతు అవుతుంది. అది ఎలెక్టెడ్ ఆటోక్రాట్స్‌కు ఒక ముసుగుగా మారుతుంది. ఎన్నికైన అనంతరం వారి నియంతృత్వ ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది.**



నియంతృత్వ ప్రయోజనాల్లో మూడు అంశాలుంటాయి. కనీసం మోదీకి సంబంధించి అట్లా ఉన్నాయి. ఒకటి, తన సొంత అధికారం. రెండు, తనను బలపరచే, తాను కూడా తోడ్పాటునిచ్చే ఆర్థికవర్గాల అవసరాలు. మూడు, తన సైద్ధాంతిక భూమి అయిన సంఘ్ పరివార్ లక్ష్యాలు ముందుకుపోవటం. ఈ మూడింటిని శాంతియుత పద్ధతుల్లో కూడా నెరవేర్చుకోవచ్చు. కానీ ఒక్కోసారి హింసాత్మకంగా ఆ పని చేయవలసి వస్తుంది. సమాజంలో చైతన్యాలు పెరిగి, ఈ తరహా ప్రణాళికలకు ప్రతిఘటన ఎదురైనప్పుడు. ప్రస్తుతం కాక్రోచ్‌ల విషయమై మోదీ ప్రభుత్వం చేస్తున్నది. అట్లా చేయడానికి కారణం, మోదీ ప్రభుత్వానికి అంతన్నా మార్గాంతరం లేకుండాపోయింది. ఇంగ్లీషులో 'పెయింటింగ్ వన్ సెల్ఫ్ ఇన్ టు ఏ కార్నర్' అనే మాట ఉన్నది. అనగా ఒక మనిషి ఒక గది నేలకు రంగు వేయడం ఒక మూలన మొదలుపెట్టి గుమ్మం వైపు వెళ్లడానికి బదులు, గుమ్మం దగ్గర మొదలై ఒక మూలకు వెళ్లడమన్నమాట. అప్పు డు ఆ మూలన చిక్కుకుని ఎట్లా బయటకు వెళ్లా లో తెలియకపోవటం వంటిది. మోదీ కూడా అ టువంటి మార్గాంతరంలేని స్థితిని తానే సృష్టించుకున్నారు. ఆ స్థితిని యువతరం, సమాజం ఎత్తిచూపడం ఆయనకు ఆగ్రహాన్ని కలిగిస్తున్నది. అది సమస్య పరిష్కారం కాదు. అయినా ఆగ్రహావేశంతో కాక్రోచ్‌లపై హింసకు పాల్పడుతున్నారు. పలు విధాలుగా విఫలమవుతున్న మోదీ పార్టీకి, సంఘ్ పరివార్‌కు ఆందోళన మొదలైంది 2024 ఎన్నికల్లో సీట్లు తగ్గడమే గాక సొంత మెజారిటీ రాకపోవడంతో. ఆ విధంగా తనను బలపరిచే ఆర్థికవర్గాలకు కూడా కలవరపాటు కలిగింది. ఆ విధంగా 'సర్' పన్నాగాలు మొదలయ్యాయి. ఆ పేరిట జరుగుతున్న దారుణాలు వెలుగులోకి వస్తూ నిరసనలు మొదలుకాగా, కాక్రోచ్‌లు కూడా ముందుకు రావడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరగడం, అది అణచివేతలకు దారితీయడం తెలిసిందే. ఆందోళనలు, అణచివేతలు తరచూ జరుగుతుండేవే. ఈ సారి ఒక ముఖ్యమైన తేడా కనిపిస్తున్నది. ఇతరత్రా ఉద్యమకారులకు భిన్నంగా అభిజీత్ దీప్కే నాయకత్వాన సీజేపీ, తమది పూర్తిగా శాంతియుత ఉద్యమమని మొదటిరోజు నుంచి పదేపదే నొక్కి చెప్తున్నది. సాధారణంగా యువతరానికి ఆగ్రహావేశాలు ఎక్కువ. హింసకు కూడా పాల్పడుతుంటారు. అయినప్పటికీ జంతర్ మంతర్ వద్ద వారాల తరబడి వేలాదిమంది రాత్రింబవళ్లు చేరినా, వారివైపు నుంచి చిన్న హింసాత్మక చర్య కూడా చోటు చేసుకోలేదు. తమది గాంధీ మార్గమని, శాంతియుత ఉద్యమమని ప్రతిరోజూ విసుగు లేకుండా ప్రకటిస్తుండిన సీజేపీ నాయకత్వం వారిని అట్లాగే నియంత్రించి అహింసా స్ఫూర్తిని కలిగించింది కూడా. అది అసాధారణమైనది. అందుకే దేశ విదేశాల్లో గుర్తింపును, గౌరవాన్ని పొందింది. సామాజికులు మెచ్చారు. ఇంతవరకు ఏ ఉద్యమాల్లో లేనంతగా యువతులు సైతం పెద్దఎత్తున ధైర్యంగా కదలివచ్చారు. వారిలో ఎందరెందరో దూరప్రాంతాల నుంచి, తల్లిదండ్రులకు చెప్పనైనా చెప్పకుండా. పోలీసుల అణచివేత, దుర్భాషలు, అసభ్య ప్రవర్తనలకు వెరవకుండా. కాక్రోచ్‌ల నాయకత్వం శాంతియుత ఉద్యమమంటూ ప్రకటించడానికి కారణాలున్నాయి. సీజేపీ అగ్రనాయకులైన అభిజీత్ దీప్కే, అశుతోష్ రాంకా, సౌరవ్‌దాస్ ఉన్నత విద్యావంతులు. లోగడ ఆమ్ ఆద్మీ పార్టీలో పని చేసినప్పుడు ప్రభుత్వపు హింస గురించి దేశంలో వివిధ ఘటనలను గమనించారు. ఉద్యమకారులు హింసా చర్యలకు పాల్పడితే పోలీసులకు అణచివేతలు, కేసులు, వేధింపులు మరింత తేలికవుతాయని గమనించారు. తామిప్పుడు తలపెడుతున్న కార్యక్రమాల్లో దేశవ్యాప్తంగా యువకులతోపాటు యువతులకు సంబంధించినవి కూడా అయినందున వారిని సమీకరించాలంటే శాంతియుత మార్గమే సరైనదన్న అభిప్రాయానికి వచ్చారు. ఇతరత్రా కూడా, మొదటి నుంచి గాంధీజీని ప్రస్తావిస్తున్న ఆ ముగ్గురికి శాంతిమార్గమే అనుసరించదగినదనే నమ్మకం కలిగింది. కనుకనే జంతర్ మంతర్ వద్ద ఆ ప్రకారం వ్యవహరించారు. పోలీసులు యువతులు సహా ఎవరిపై ఎంత దమనకాండకు పాల్పడినా భరించారు, శాంతియుతంగా నిరసించారే తప్ప, అన్ని వారాల కాలంలో ఒక్క రాయి కూడా విసరకపోవడం దేశ ఉద్యమాల చరిత్రలో అపూర్వమైనది. మోదీ ప్రభుత్వం వారి డిమాండ్‌ను అంగీకరించినా లేకున్నా యువతరం క్రమశిక్షణను గుర్తించి ప్రశంసించవలసింది. తను కూడా కొన్ని పాఠాలు నేర్చుకోవలసింది. ఆ పని చేయకపోగా పోలీసుల ద్వారా క్రూరంగా వ్యవహరించింది. మగపిల్లలు, ఆడపిల్లలనే తేడా లేకుండా హింసను ప్రయోగించింది. ఆడ పోలీసులతోనూ హింస జరిపించింది. మరింత ధూర్తమైన పనేమిటంటే, యువతుల పట్ల మగ పోలీసు అధికారులు, ఆడ పోలీసులు రౌడీల వలె దుర్భాషలాడుతూ, శారీరకమైన అసభ్య ప్రవర్తనకు దిగజారారు. ఆ భాష, చర్యలు రికార్డు అవుతూ సోషల్ మీడియా ద్వారా దేశ విదేశాలకు చేరి అందరినీ దిగ్భ్రాంతికి గురి చేస్తున్నా, ఎన్ని విమర్శలు వస్తున్నా సిగ్గుపడక, వెరవక, అవే చర్యలు కొనసాగించారు. చివరికి ప్రైవేట్ రౌడీలనూ రంగంలోకి దించారు. దానిని బట్టి, మోదీ ప్రభుత్వం పోలీసులను ఎంతగా హింసకు ఉసిగొల్పిందో అర్థం చేసుకోవచ్చు. అంతకుమించి గ్రహించవలసింది, అట్లా హింసకు ఉసిగొల్పటానికి కారణం ఏమై ఉంటుందన్నది. అది గ్రహించడం కష్టంకాదు. ఆయన ప్రభుత్వం కాక్రోచ్‌లు లేవనెత్తిన అంశాలు, ఉద్యమంతో, అందుకు దేశవ్యాప్తంగా యువతరం నుంచేగాక సమాజం నుంచి వస్తుండిన అనూహ్యమైన స్పందనలతో భయకంపితమైంది. ఓటర్ జాబితాల సవరణ కుంభకోణం ముందుకు వచ్చే సరికి ఆ భయం తారస్థాయికి చేరింది. ఆ అంశం అసలు తమ అధికారాన్నే తలకిందులు చేయగలది. అది ఏ విధంగానో ఇప్పటికే వెల్లడి అయినందున మళ్లీ రాయనక్కరలేదు. ఆ ప్రమాదాన్ని ఎదుర్కొనగల ఏకైక మార్గం హింస అనేది మోదీ ఎంచుకున్న మార్గం. 'మాతో చర్చలు ఎందుకు జరపరు?' అని కాక్రోచ్ నాయకులు పలుమార్లు కోరినా స్పందించనిది అందువల్లనే. అదే ఎన్నికైన నియంతృత్వపు నికార్సయిన ధోరణి. మోదీ ప్రభుత్వం హింసా విధానం పోలీసు బలగాల వినియోగరూపంలో మాత్రమే కనిపించడంలేదు. శాంతియుత ప్రదర్శనకారులపై నిర్హేతుకమైన రీతిలో కేసులు బనాయించే తీరుకూడా హింసే. ముంబయి నుంచి వచ్చిన సీజేపీ నాయకులను విమానం నుంచే లాగి నిర్బంధించిన దృశ్యాల వంటివి ఎప్పుడూ చూడని దేశ ప్రజలు, ఇతర దేశాలవారు నిర్ఘాంతపోయారు. వారిని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ల ముందుగాక పోలీస్ మెజిస్ట్రేట్ల ఎదుట హాజరుపరిచి శాంతి బాండ్లపై సంతకాలు చేయించడం కూడా హింసా పద్ధతే. శాంతి పేరిట, ఉద్యమకారులు అసలు తమ రాజ్యాంగబద్ధ నిరసన హక్కులను సైతం వదలుకునేట్టు చేయడమంటే ఏమిటి? ఎటువంటి హింసకు పాల్పడకుండా జాతీయ పతాకాలతో శాంతియుత ప్రదర్శనలు జరపడాన్ని కూడా మోదీ ప్రభుత్వం హింసగా చిత్రీకరిస్తున్నదంటే, స్వయంగా తానే ఎటువంటి హింసకు పాల్పడుతున్నదో దేశమంతా, ప్రపంచమంతా గమనిస్తున్నది. ఆ విధంగా 'విశ్వగురు' నిజస్వరూపం అందరికీ బహిర్గతమైపోయింది. మోదీ అంతిమ భయం ఒకే ఒకటి. ఈ పరిణామాలు తన అధికార భ్రష్టత్వానికి ఎక్కడ దారితీస్తాయోనని. కనుక ఎటువంటి హింసకైనా వెనుకాడరాయన. రాగల కాలంలోనూ ఇదే పని చేయగలరనడంలో సందేహం ఉండనక్కరలేదు.

# తగ్గేదే లేదు 52 వార్డులకు

# 52 వార్డులు పోటీ చేస్తున్నాం.





**-నంద్యాలలో వైసీపీ జెండా ఎగరవేస్తున్నాం.**

**-విస్తృతంగా ఎన్నికల ప్రచారం కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలనపై నంద్యాలలో 'శిల్పా రవి రెడ్డి సమరభేరి.**

**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
స్థానిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నంద్యాల పట్టణంలోని 7,8,10,11 వార్డులలో వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థులైన చిల్లు భాయ్ ఏజాజ్ హుస్సేన్, షేక్ అబ్దుల్ మజీద్, దండే సుధాకర్, షేక్ అబ్దుల్ కలాం బాషా, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి అమీర్ బాష (దాల్మిల్ అమీర్)తో కలిసి శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా విస్తృత ప్రచారం నిర్వహించారు. వైసీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. వైసీపీ అభ్యర్థుల కోసం వార్డులో ఉన్న సీనియర్ వైసీపీ నాయకులందరూ కలిసి గట్టుగా అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తున్న వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, హామీల ఉల్లంఘనలను ఎండగట్టారు. మున్సిపాలిటీలో 52 వార్డులకు 52 పోటీ చేస్తున్నామని నంద్యాలలో వైసిపి జెండా ఎగరవేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు శిల్పా రవి రెడ్డి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేద ప్రజలను, మహిళలను నిలువునా మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలకు 2 సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తామని చెప్పి మాట తప్పిన కూటమి నాయకులు, అబద్ధాల కరపత్రాలతో ప్రజలను మళ్లీ మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. 'ఎన్నికలు రాగానే కూటమి నాయకులకు మళ్లీ జనం గుర్తుకోస్తారని , నంద్యాలలో 25 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేశామంటూ విచ్చలవిడిగా కరపత్రాలు ముద్రించి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన 2 సెంట్ల స్థలం హామీ ఏమైంది? పేదల నడ్డి విరిచి గద్దెనెక్కిన ఈ ప్రభుత్వానికి ఓటుతోనే ప్రజలు బుద్ధి చెప్పాలని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పిలుపు నిచ్చారు". ఎన్నికల సమయంలో నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు మోసపూరిత హామీలు ఇచ్చారని శిల్పా రవి మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గాలికి వదిలేసి ప్రజలపై తీవ్ర భారం మోపారని ఆరోపించారు.పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తామని నమ్మించి మహిళలను దారుణంగా మోసం చేశారని శిల్పా రవిరెడ్డి విమర్శించారు."నీకు 15.. నీకు 15": మహిళలకు రూ. 15 వేల నగదు పథకం అందిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 50 ఏళ్ల లోపు మహిళలకు ఏడాదికి రూ. 18 వేలు ఇస్తామన్న ప్రకటనలు ఏమయ్యాయని నిలదీశారు.గత మూడేళ్లుగా 'సూపర్ సిక్స్' పథకాలను అమలు చేస్తామని కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న కూటమి అభ్యర్థులను ఓటు అనే ఆయుధంతో ఓడించి ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే నంద్యాల పట్టణ రూపురేఖలు మారాయని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి స్పష్టం చేశారు.పట్టణంలో 8 నూతన పార్కుల నిర్మాణం, అర్బన్ హెల్త్ సెంటర్లు, మిల్క్ సెంటర్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. నాడు-నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశామని తెలిపారు. దశాబ్దాలుగా నంద్యాల ప్రజలను వేధిస్తున్న తాగునీటి సమస్యను 'అమృత్' పథకం ద్వారా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని ఆయన గర్వంగా ప్రకటించారు.

అభివృద్ధికి పట్టంకట్టిన వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచి, ప్రజా వ్యతిరేక కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

# అవినీతి నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి.

**-యువత, విద్యావంతులు కీలక పాత్ర పోషించాలి.**

**-జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**




**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
అవినీతి రహిత సమాజ నిర్మాణం ప్రతి పౌరుడి బాధ్యత అని, సమాజాభివృద్ధికి అడ్డంకిగా ఉన్న అవినీతి నిర్మూలనలో యువత, విద్యావంతులు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అవినీతి నిరోధక 1064 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో అవినీతి నిరోధక చైతన్యం పెంపొందించి, పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈనెల 26 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్ల ప్రదర్శన, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీలు, విజిలెన్స్ అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 30న టోల్‌ఫ్రీ నంబర్ 1064పై ఎఫ్‌ఎం రేడియో ద్వారా ప్రచారం చేపట్టి, అక్టోబర్ 31న మండల కేంద్రాల్లో ప్రజలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏసీబీ సీఐ రామాంజనేయులు, ఎస్ఐ సుబ్బరాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

# 30 ఏళ్ల రాజకీయ అనుభవం.. ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు

**- వైసీపీ నేత షేక్ అమీర్ బాషా.**



**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
నంద్యాల జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ అమీర్ బాషా రాజకీయాల్లో 30 ఏళ్ల అనుభవంతో కొనసాగుతున్నారు. దాల్ మిల్ అమీర్‌గా పేరొందిన ఆయన వ్యాపార రంగంలో రాణిస్తూనే, రాజకీయాలు మరియు సామాజిక సేవలో తనదైన గుర్తింపు పొందారు. దాల్ ఇండస్ట్రీస్, విత్తన వ్యాపార రంగాల్లో కొనసాగుతున్న ఆయనకు సామాజిక సేవకు గుర్తింపుగా అమెరికన్ యూనివర్సిటీ గ్లోబల్ పీస్ సంస్థ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లో చురుకుగా కొనసాగుతున్న షేక్ అమీర్ బాషా.తాజాగా మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే శిల్పారవి తన పేరును ప్రకటించటంతో తాను చేసే సేవా కార్యక్రమాలు ప్రజలకు అందించడంలో ఇదొక సువర్ణ అవకాశం మాజీ మంత్రి,మాజీ ఎమ్మెల్యే కల్పించారు.నంద్యాల ప్రజల నన్ను చైర్మన్ గా గెలిపిస్తే ప్రజా సమస్యలతో పాటు మరిన్ని సేవాకార్యక్రమాలు చేస్తానని,నంద్యాల ప్రజల మన్నలతో చైర్మన్ అభ్యర్థిగా గెలుపొంది నంద్యాల ప్రజల సేవకు మరింత దగ్గరయ్యేలా ముందుకు సాగానిస్తారని కోరారు.

# శ్రీశైలంలో లోకకల్యాణార్థం పంచమఠాలలో విశేష పూజలు

**తేదీ: 26.10.2026 । డ్రీమ్ టైమ్స్**
శ్రీశైలం: లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ శ్రీశైలంలోని పంచమఠాలలో సోమవారం ఉదయం విశేష అభిషేకాలు, పుష్పార్చనలు నిర్వహించారు. ముందుగా ఘంటామఠంలో, అనంతరం వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలో సంప్రదాయబద్ధంగా పూజాదికాలు జరిపించారు.



**లోకకల్యాణ సంకల్పంతో పూజలు**
విశేష పూజలకు ముందు అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్ని పఠించారు. దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో దేశం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని, అకాల మరణాలు సంభవించకుండా ఉండాలని, అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు జరగకుండా ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని సంకల్పించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ముందుగా ఘంటామఠంలోని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్ని మఠాలలో అభిషేకాలు, అర్చనలు సంప్రదాయబద్ధంగా జరిపించారు.

**శ్రీశైల చరిత్రలో పంచమఠాలకు విశిష్ట స్థానం**
శ్రీశైల క్షేత్ర సంస్కృతిలో మఠాలు శతాబ్దాలుగా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. సాధారణ శకం ఏడవ శతాబ్దం నుంచి నిర్మించబడిన ఈ మఠాలు గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం వంటి నిర్మాణాలతో ఆలయాలను పోలి ఉంటాయి. క్షేత్ర ప్రశాంతతను కాపాడటంతో పాటు ఆలయ నిర్వహణ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భక్తులకు సదుపాయాల కల్పనలో ఇవి కీలక పాత్ర పోషించాయి.
కాలక్రమంలో కొన్ని మఠాలు కనుమరుగైనా, ప్రస్తుతం శ్రీశైల ఆలయానికి సమీపంలోని వాయువ్య భాగంలో ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం పంచమఠాలుగా ప్రసిద్ధి చెందాయి.

**ప్రాచీన నిర్మాణాలకు పునరుద్ధరణ**
శిథిలావస్థకు చేరిన ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలగకుండా పునర్నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసింది. భీమశంకరమఠానికి కూడా అవసరమైన మరమ్మతులు నిర్వహించారు. పంచమఠాలలోని దేవతామూర్తులకు నిత్యం ధూపదీప నైవేద్య కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. ఈ విధంగా ప్రాచీన ఆధ్యాత్మిక సంప్రదాయాలను పరిరక్షిస్తూ దేవస్థానం పూజా కార్యక్రమాలను చేస్తున్నారు

# శ్రీశైలంలో అన్నప్రసాద వితరణకు రూ.1,00,116 విరాళం



**తేదీ: 26.10.2026 । డ్రీమ్ టైమ్స్**
శ్రీశైలం: శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి కర్నూలుకు చెందిన శ్రీ కె. రాజేశ్వరరావు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళ మొత్తాన్ని దేవస్థాన సహాయ కార్యనిర్వహణాధికారి బి. మల్లికార్జునరెడ్డికి అందజేశారు. అనంతరం దాతకు తగిన రశీదుతో పాటు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం అందించిన దాతను దేవస్థాన అధికారులు అభినందించారు.

# మహదేవపురం ఎంపీటీసీ గజ్జల పెద్ద మద్దిలేటి సమర్పించిన బీఫారం.

**శిరివెళ్ళ. (డ్రీమ్ టైమ్స్)**



మండల పరిధిలోని నల్లమల అడవి సమీపంలో గల మహదేవాపురం గ్రామ ఎంపీటీసీ అభ్యర్థి గజ్జల పెద్ద మద్దిలేటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున తన బీఫాంలో స్థానిక ఎన్నికల అధికారులకు అందజేశారు. గజ్జల పెద్ద మద్దిలేటి వెంట మాజీ ఎంపీటీసీ మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నరహరి మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువనేత కంపరాజు రాజేష్ గౌడ్ మరియు ఇతర ప్రముఖులు గ్రామ పెద్దలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామ అభివృద్ధి కోసం గ్రామ ప్రజల సంక్షేమం కోసం ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలో నిలిచామని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి గారు మాజీ ఎమ్మెల్యే గంగుల భీజేంద్ర రెడ్డి గారీ సహకారంతో ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల అధికారికి బీఫారం అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందాయని పేద బడుగు బలహీన వర్గాలకు ధరలు అందుబాటులో ఉండేవని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో అధిక ధరలతో సామాన్యులు విలవిలలాడుతున్నారని ధరల బాదుడిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో పేదలు ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నారని పేర్కొన్నారు.

# ఘనంగా వాల్మీకి జయంతి



**నంద్యాల ప్రతినిధి, అక్టోబరు 26 (డ్రీమ్ టైమ్స్)**
నంద్యాల బస్టాండ్ సమీపంలో వాల్మీకి జయంతిని ఘనంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. జయంతిని పురస్కరించుకుని ఎంవిఆర్పీఎస్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షికి నేతలు కాయ కర్పూరం వెలిగిశీచి పూలదండలతో పూజలు చేసి భక్తిని చాటుకున్నారు. మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నాగేశ్వరరావ్, కార్యదర్శి జయరాం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్, న్యాయ సలహాదారులు సుబ్బారాయుడు, నాగరాజు, వెంకటేశ్వర్లు, శివకుమార్, శివనాగేంద్ర, సూరి, రవి, పరమేష్, పెద్ద మహేష్, నాగేశ్వరావు, కుమార్, మద్దిలేటీ, శేఖర్, శ్రీనివాసులు, సవారీ, మల్లికార్జున, రమేష్, శ్రీను, ఓబులేసు, వంశీ, శివ, కేశవ, అర్జున్, అఖిల్, తరుణ్, జయరాం, సుంకన్న, చేతు, బ్రహ్మానాయుడు, నిఖిల్, నాగేంద్ర, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పులికొండన్న, బీసీ నేత ప్రసాద్, సుబ్బరాయుడు, పరమేష్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణ మహా కావ్యం ద్వారా ప్రపంచ మానవాళికి మంచి చెడులు నేర్పిన మహనీయుడని కొనియాడారు. చదువు రాకున్నా తపస్సు చేసి మహాకావ్యాన్ని రాయడంతోపాటు రాముడిని దేవుడిగా పరిచయం చేసిన వ్యక్తి అని తెలిపారు. అటువంటి మహనీయుడిని పాలకులు మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. 69 సంవత్సరాలుగా ూ పునరుద్దరణ చేయాలని ఉద్యమిస్తున్నా ప్రభుత్వం కూడా వాల్మీకులను మభ్యపెడుతోందని ఆరోపించారు. అనంతరం పాలకుల నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా మహర్షి ముందు అర్ధనగ్న ప్రదర్శన చేశారు.

# అనుమతులు లేని ఇసుక నిల్వ సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

**పాపన్నపేట, అక్టోబర్26 డ్రీమ్ టైమ్స్**



పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సన్పల్లి గ్రామంలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా గ్రామంలోని మూడు వేరువేరు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుకను గుర్తించారు. సదరు ఇసుక నిల్వాలపై విచారణ నిర్వహించగా, ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ చేసినట్లు గుర్తించడంతో మొత్తం మూడు చోట్ల కల మొత్తం 19 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను గ్రామ జిపిఓ భూమయ్య సంబంధిత రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేశారు.

## ఎన్నికల వేళ ఆత్మకూరులో పోలీసుల ఫుట్ పెట్రోలింగ్

**-శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు.. ప్రజల్లో భద్రతా భావం కల్పించడమే లక్ష్యం**



**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 26, 2026.**
నంద్యాల :స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆత్మకూరు పట్టణంలో పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్ సూచనలతో ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఎస్‌ఐ నారాయణ రెడ్డి, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొని పట్టణంలోని వెంకల్ రెడ్డి నగర్, కప్పలకుంట, ఆసర్ మసీదు, పెద్ద బజార్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఎన్నికల సమయంలో ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం, శాంతిభద్రతలను కాపాడటం, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ఫుట్ పెట్రోలింగ్ ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పోలీసు శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

## నంద్యాల పోలీస్ కార్యాలయంలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

**మానవతా విలువలకు రామాయణం మార్గదర్శకం: జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**



**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 26, 2026.**
నంద్యాల :నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ భారతదేశం ఎందరో మహనీయులకు జన్మనిచ్చిన పుణ్యభూమి అని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి వంటి మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం ద్వారా యువత స్ఫూర్తి పొందాలని, వారు చూపిన మార్గంలో నడుస్తూ తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. వాల్మీకి మహర్షి రచించిన రామాయణ మహాకావ్యం మానవతా విలువలు, ఉన్నతమైన ఆదర్శాలు, ధర్మబద్ధమైన జీవన విధానాన్ని బోధిస్తూ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోందని ఎస్పీ పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ మంచి విలువలను అలవర్చుకోవాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఖాదర్ బాషా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చిన్నికృష్ణ, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, డీపీఓ ఏఓ వీరన్న, ఆర్ఐలు బాబు, సురేష్, ఏఆర్ఎస్ఐ హర్షవర్ధన్ రెడ్డి తదితరులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైలంలో శివమహాత్మ్యంపై ప్రవచనం.. వీణాకచేరి నిర్వహణ

**తేదీ: 26.10.2026 । డ్రీమ్ టైమ్స్**
**శ్రీశైలం:** శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిత్యకళారాధన వేదికపై సోమవారం సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనం, వీణాకచేరి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదికపై మహబూబ్‌నగర్‌కు చెందిన శ్రీ ఇరువింటి శ్రవణకుమార్ శర్మ "శివమహాత్మ్యం" అంశంపై ప్రవచనం చేశారు. అనంతరం నెల్లూరుకు చెందిన శ్రీమతి డి. నాగలక్ష్మి, వారి బృందం వీణాకచేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం నిత్యకళారాధనలో భాగంగా ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యాలు, వాయిద్య సంగీతం, భక్తిరంజని తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. శ్రీశైల మల్లికార్జున స్వామివారు, భ్రమరాంబ అమ్మవార్లకు నిర్వహించే కైంకర్యాలు పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళలను పరిరక్షించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చేశారు




## కొంపల్లిలో 'ఎస్‌వీఎం లక్స్' హోటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**హైదరాబాద్, అక్టోబరు 26 డ్రీమ్ టైమ్స్ ।**
ఎస్‌వీఎం గ్రూప్ ఆఫ్ హోటల్స్ తన తొమ్మిదో బ్రాంచ్‌గా కొంపల్లిలో ఏర్పాటు చేసిన లగ్జరీ హాస్పిటాలిటీ బ్రాండ్ 'ఎస్‌వీఎం లక్స్'ను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ శాసనసభా పక్ష విప్ కేపీ వివేకానంద్ ప్రారంభించినట్లు ఎస్‌వీఎం సంస్థ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.వర ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ హోటల్‌లో 88 గదులు, 11 బ్యాంక్వెట్ హాళ్లు, లగ్జరీ సూట్లు, ఫైన్ డైనింగ్, లాంజ్ బార్, బోర్డ్ రూమ్ సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో ప్రముఖ గాయని గీతా మాధురి లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ నిర్వహించగా, సుమారు 3 వేల మంది పాల్గొన్నారని తెలిపారు.



# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి.






**-పోలింగ్ కేంద్రాలు, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి.**

**-బ్యాలెట్ బాక్సుల పనితీరును తనిఖీ చేసి, ఎన్నికల సామగ్రి భద్రతపై సమీక్ష.**

**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన రిసెప్షన్ కౌంటర్, డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ను జనరల్ అబ్జర్వర్ పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేసే ప్రక్రియ సజావుగా జరిగేలా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల సామగ్రి పంపిణీలో స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఎన్నికల సామగ్రి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలిస్తూ, నిర్దేశిత నిబంధనల ప్రకారం భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.
అనంతరం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడి ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఓటర్లు సౌకర్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియలో వినియోగించే బ్యాలెట్ బాక్సుల పనితీరును పరిశీలించి, వాటి వినియోగానికి సంబంధించి అవసరమైన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో క్రమబద్ధమైన ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి భద్రత, సిబ్బందికి అవసరమైన సదుపాయాలు, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న, నోడల్ అధికారి శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి మోసాలను ఎదిరిద్దాం.. నంద్యాలలో ఫ్యాన్ జెండా ఎగరేద్దాం.

**- కూటమి ప్రభుత్వంపైమాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి నిప్పులు చెరిగారు.**

**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
నంద్యాల పట్టణంలో సుపరిపాలన, సమగ్రాభివృద్ధి మళ్లీ సాధ్యం కావాలంటే వైఎస్సార్సీపీనే ఏకైక శరణ్యమని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన దగాకోరు కూటమి ప్రభుత్వానికి నవంబర్ 1న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని ఆయన ఉద్వేగభరితంగా పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలోని 25, 28, 29, 31 వార్డులలో హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారంలో శిల్పా రవిరెడ్డి కదిలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి తీవ్ర ఆవేశంతో ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థులు శ్వేత, కామిని రాజశేఖర్ రెడ్డి, యల్లంపల్లి శివశంకర్ రెడ్డి, గంగా చరణ్ రెడ్డి మరియు చైర్మన్ అభ్యర్థి అమీర్ బాష (దాల్మిల్ అమీర్) లను ఫ్యాన్ గుర్తుపై భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష తదితరులు పాల్గొన్నారు.




కూటమి సర్కార్ పై శిల్పా రవిరెడ్డి విరుచుకుపడ్డారు.
**మోసపూరిత వాగ్దానాలు:** ఎన్నికల సమయంలో 'సూపర్ సిక్స్' అంటూ ఆకాశమే హద్దుగా హామీలిచ్చి ఓట్లు దండుకున్న కూటమి నాయకులు, నేడు అధికారంలోకి వచ్చాక ప్రజలను నట్టేట ముంచారని, నంద్యాల ప్రజలను మోసంతో దగా చేశారని మండిపడ్డారు.
**ప్రశ్నిస్తే కక్షసాధింపులేనా?:** ప్రజలు తాము ఇచ్చిన హామీలను, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని నిలదీస్తే వారిపైనే ఎదురుదాడి చేస్తున్న ఈ మోసపూరిత నేతల మాటలను ఇకపై నమ్మవద్దని ఆయన హెచ్చరించారు.
**గత పాలనే మనకు రక్ష:** వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో గడపగడపకు వెళ్లి ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించామని, నంద్యాల నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి ఫలాలను అందించామని గుర్తుచేశారు. నేడు టీడీపీ నాయకులు 'ఇంటింటికి తెలుగుదేశం' అంటూ వస్తున్నారని, ఓట్లు అడిగేసి వెళ్లిన వీరు ఎప్పుడైనా మీ సమస్యల కోసం మీ ఇంటి ముంగిటికి వచ్చారా అని సూటిగా నిలదీశారు.
**నంద్యాల గడ్డపై ఫ్యాన్ జెండా ఎగరడం ఖాయం!**
శిల్పా సేవా సమితి ద్వారా తాము చేపడుతున్న నిరంతర ప్రజా సేవలను సైతం రాజకీయ కక్షలతో అడ్డుకోవాలని చూసిన కుట్రలను ప్రజలు గమనించాలని శిల్పా రవిరెడ్డి హితవు పలికారు. నంద్యాల భవిష్యత్తును, సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్క ఓటరు నవంబర్ 1వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, అఖండ విజయంతో రికార్డు సృష్టించాలని ఆయన తీవ్ర భావోద్వేగంతో కోరారు.

# మతతత్వ పార్టీ బిజెపితో జతకట్టిన.. కూటమి అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించండి..!

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ పిలుపు**

**గుంతకల్లు, అక్టోబరు 26(డ్రీమ్ టైమ్స్):**
మతతత్వ పార్టీ బిజెపితో జత కట్టిన కూటమి భాగస్వామ్య టిడిపి జనసేన అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లోనూ, ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ పిలుపు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం గుంతకల్లు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వర బాబు (చిన బాబు) తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.నవంబరు ఒకటవ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి, సిపిఐ పార్టీల మధ్య కౌన్సిలర్ల సీట్ల పంపకం జరిగిందని స్పష్టం చేశారు. ఇరు పార్టీల ఏకాభిప్రాయంతో గుంతకల్లు మున్సిపాలిటీలో మూడు వార్డుల్లో సిపిఐ అభ్యర్థులు వైసిపి మద్దతుతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నారన్నారు. మతతత్వ బిజెపి పార్టీతో జతకట్టిన టిడిపి, జనసేన మూడు పార్టీలను మున్సిపల్ ఎన్నికల్లో ఓడించాలన్న లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలో వైసిపి మద్దతుతో సిపిఐ అభ్యర్థులు కూడా పోటీలో నిలిచారని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా గుంతకల్లులో కూడా మూడు వార్డుల్లో తమ పార్టీ అభ్యర్థులు కౌన్సిలర్లుగా పోటీ చేస్తున్నారన్నారు. అంతేకాకుండా రెండుసార్లు



గుంతకల్లు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన దివంగత, గాది లింగప్ప హయాంలో గుంతకల్లు నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయనించిందని ఆయన గుర్తు చేశారు. ప్రజా శ్రేయస్సు, సంక్షేమం, అభివృద్ధి కి కట్టుబడిన గాది లింగప్ప కుటుంబం నుండి ఆయన సతీమణి మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థినిగా పోటీలో నిలిచిన వెంకటలక్ష్మి గెలుపునకు సిపిఐ పార్టీ శక్తివంచను లేకుండా కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార కూటమి దౌర్జన్యానికి పాల్పడిందన్నారు. అన్ని స్థానాలను ఏకగ్రీవం చేసుకోవాలన్న దురుద్దేశంతో పోలీసు అధికారులను అడ్డుపెట్టుకొని హింసకు పాల్పడడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఎన్నికలు నిర్వహించే కంటే మేయర్, మున్సిపల్ చైర్మన్ వంటి పదవులను నామినేటెడ్ పద్ధతిన నియమిస్తే సరిపోతుంది కదా అని ఆయన ఎద్దేవ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గాదిలింగప్ప తనయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. గాదిలింగేశ్వర బాబు (చిన బాబు) మాట్లాడుతూ తన తండ్రి ఒక దఫా తెలుగుదేశం హయంలోనూ, రెండవ దఫా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ గుంతకల్లు నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించాలని ఆయన గుర్తు చేశారు. ఆయన హయంలో గుంతకల్లు నియోజకవర్గం అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం తన తండ్రి మరణానంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తన సోదరి నీలావతి కూడా తన తండ్రి బాటలోనే గుంతకల్లు అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేశారన్నారు. అదే క్రమంలో ప్రస్తుతం గుంతకల్లు మున్సిపల్ చైర్పర్సన్ బీసీ మహిళకు కేటాయించడంతో తన తల్లి ఎన్ వెంకటలక్ష్మి చైర్పర్సన్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఇచ్చారన్నారు. గుంతకల్లు పట్టణ ప్రజలు ఆమెను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే తన తండ్రి, తన సోదరి తరహాలోని గుంతకల్లు పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# శ్రీశైల దేవస్థానంలో క్రమశిక్షణ చర్యలు.. ముగ్గురు సిబ్బంది సస్పెండ్



**శ్రీశైలం, అక్టోబరు 26 డ్రీమ్ టైమ్స్ ।**
శ్రీశైల దేవస్థానంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ముగ్గురు సిబ్బందిపై ఈవో ఎం. శ్రీనివాసరావు సోమవారం చర్యలు తీసుకున్నారు. ఇన్చార్జి డీఈ చంద్రశేఖర శాస్త్రి, ఏఈ జైపాల్ నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌లను విధుల నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేశారు.
విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన కారణంగా ఈ ముగ్గురిపై సస్పెన్షన్ వేటు పడింది. దేవస్థానంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించిన నేపథ్యంలో ఈవో ఈ నిర్ణయం తీసుకున్నారు.
దేవస్థాన పరిపాలనలో విధి నిర్వహణ, బాధ్యతల పట్ల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణించిన ఈవో చర్యలు చర్చనీయాంశంగా మారాయి. ఈ మేరకు ముగ్గురు సిబ్బందిని తాత్కాలికంగా విధుల నుంచి నిలుపుదల చేశారు.

# వాల్మీకి జయంతి వేడుకల్లో బిజెపి నేత గుమ్మనూరు నారాయణ



**గుంతకల్లు, అక్టోబరు26(డ్రీమ్ టైమ్స్)**
గుంతకల్లు పట్టణంలోని మోదినాబాద్‌లో సోమవారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. మోదినాబాద్‌కు చెందిన వాల్మీకి సామాజిక వర్గం ప్రతినిధుల ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆలూరు నియోజకవర్గ బీజేపీ బీఎల్ఓ-1 గుమ్మనూరు నారాయణ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేశారు .మహర్షి వాల్మీకి సేవలు స్మరణీయ మన్నారు .రామాయణ మహాకావ్యాన్ని రచించిన ఆదికవి మహర్షి వాల్మీకి భారతీయ సంస్కృతి, సాహిత్య చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్నారు. ఆయన జీవితం, బోధనలు, సాహిత్య సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా గుర్తుచేశారు. వాల్మీకి జయంతి వేడుకలు మహర్షి ఆశయాలను స్మరించుకోవడంతోపాటు, సమాజంలో ఐక్యత, సోదరభావం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయి.
వాల్మీకి జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మహర్షి వాల్మీకి పట్ల గౌరవాభిమానాలను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మనూరు నారాయణ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 27,28,28 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు



**గుంతకల్లు, అక్టోబరు 26 (డ్రీమ్ టైమ్స్):**
ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈనెల 27, 28, 29 తేదీల్లో గుంతకల్లు మున్సిపల్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశామని ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ సిబ్బంది సౌకర్యార్థం పోస్టల్ బ్యాలెట్ కోసం కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 27, 28, 29 తేదీల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తామని తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చేవారు తమ ఓటు గుర్తింపు కార్డు, ఎన్నికల విధుల కేటాయింపు ఉత్తర్వులు కాపీ చూపాల్సి ఉంటుందన్నారు. ఓటింగ్ ప్రక్రియలో పూర్తి గోప్యత పాటించేలా ప్రత్యేక కంపార్ట్మెంట్ ఏర్పాటు చేశామని తెలిపారు.

# ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

**-శిరివెళ్ల టిడిపి ఎంపీపీ అభ్యర్థి మేరువ చిన్న నరసింహా రెడ్డి దంపతులకు ఘన సన్మానం.**



**శిరివెళ్ళ .(డ్రీమ్ టైమ్స్)**
మండల పరిధిలోని కామినేని పల్లి గ్రామ పంచాయితీలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ మండల నేత, శిరివెళ్ల మండల ఎంపీపీ అభ్యర్థి, కామినేని పల్లె గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ మెరువ చిన్న నరసింహారెడ్డి దంపతులు హాజరయ్యారు. వాల్మీకి మహర్షి దేవాలయంలో విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేరువ చిన్న నరసింహారెడ్డి దంపతులను గ్రామస్తులు వాల్మీక సంఘం ప్రతినిధులు ప్రజలు పట్టు శాలువలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా చిన్న నరసింహారెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి అందించిన భారతీయ సంస్కృతి సాహితీ సాంప్రదాయాలు సమాజానికి మార్గదర్శకాలు అని కొనియాడారు. మహర్షి వాల్మీకి రచించిన రామాయణం వల్ల మానవ విలువలు సత్యం ధర్మం నిజాయితీ కుటుంబ బంధాలు ఆదర్శవంతమైన జీవన విధానానికి బాటలు వేశాయని తెలియజేశారు. వాల్మీకి మహర్షి బోధించిన జీవిత ఆశయాలు ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వాల్మీకి సంఘం ప్రతినిధులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో ఆధునిక ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

**-రోజుకు 250 మందికి ఆధార్ సేవలు.. నాలుగు కిట్లతో సౌకర్యాలు**



**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబరు 26 డ్రీమ్ టైమ్స్ ।**
తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అత్యాధునిక ఆధార్ సేవా కేంద్రం(ఎ.ఎస్.కె) కార్యకలాపాలను ప్రారంభించింది. స్థానిక ప్రజలకు ఆధార్ నమోదు, వ్యక్తిగత వివరాల సవరణ, బయోమెట్రిక్ సమాచారం నవీకరణ తదితర సేవలను మరింత సులభంగా అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ అంకిత్(ఐఏఎస్) ఇతర ప్రముఖులతో కలిసి కేంద్రాన్ని ప్రారంభించారు. కొత్తగూడెంలోని ఓల్డ్ కొత్తగూడెం, గంగా భూషణ్ బస్తీ, ఇంటి నంబర్ 13-3-58, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆధార్ నమోదు, నవీకరణ సేవల కోసం నాలుగు పూర్తి స్థాయి కిట్లను అందుబాటులో ఉంచారు. ఈ కేంద్రం ద్వారా రోజుకు 200 నుంచి 250 మంది వరకు సేవలు పొందే సామర్థ్యం ఉంది. ప్రభుత్వాలు, పౌరులకు సాంకేతిక సేవలను అందించడంలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ ఈ కేంద్ర నిర్వహణ బాధ్యతలను చేపట్టింది. కొత్త ఆధార్ నమోదు చేసుకోవడంతో పాటు పేరు, చిరునామా, పుట్టిన తేదీ వంటి వివరాల సవరణ, బయోమెట్రిక్ వివరాల నవీకరణ, పత్రాలకు సంబంధించిన సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ఫిర్యాదుల పరిష్కారం, ఆధార్ సేవలకు సంబంధించిన సందేహాల నివృత్తికి కూడా సదుపాయం కల్పించారు. ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు కేంద్రంలో ప్రత్యేక సహాయ కేంద్రం, నిరీక్షణ ప్రాంతాలు, టోకెన్, క్యూ నిర్వహణ వ్యవస్థ, తాగునీరు, ఎయిర్ కండిషనింగ్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగులు సులభంగా సేవలు పొందేందుకు వీల్‌చైర్ సదుపాయం, దివ్యాంగులకు అనుకూలమైన మరుగుదొడ్లను అందుబాటులో ఉంచారు. ఆధార్ సంబంధిత సేవలను సురక్షితంగా, సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయడంలో ఈ కేంద్రం కీలకంగా నిలవనుంది.

# మాదిగల మహాగర్జన సభ వాయిదా.. డిసెంబర్‌లో నిర్వహణ

**-ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేదాసి మోహన్ వెల్లడి**




**హైదరాబాద్, అక్టోబరు 26 డ్రీమ్ టైమ్స్ ।**
ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అక్టోబర్ 28న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మాదిగల మహాగర్జన సభ వాయిదా పడింది. ఈ సభను డిసెంబర్‌లో లక్షలాది మందితో అత్యంత భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేదాసి మోహన్ తెలిపారు. ఎస్సీ సంక్షేమ పథకాల అమలు, దళితులకు దక్కాల్సిన వాటా సాధన లక్ష్యంగా ఈ మహాగర్జన సభను నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా సంస్థాగత నిర్మాణాలు ఇంకా పూర్తి కాకపోవడం, మండల, జిల్లా స్థాయి కమిటీల నియామక ప్రక్రియ కొనసాగుతుండటంతో పాటు రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడానికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య సూచనల మేరకు రాష్ట్ర కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. డిసెంబర్‌లో నిర్వహించే మహాగర్జన సభ తేదీ, వేదిక వివరాలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. సభ విజయవంతానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే కృషి చేయాలని కేదాసి మోహన్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో సంఘ నిర్మాణాలను పూర్తి చేసి, సభకు భారీగా ప్రజలను సమీకరించాలని కోరారు. ఈ సందర్భంగా మాదిగ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు మంచాల యాదగిరి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మాదిగ యువసేన కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి, డిసెంబర్‌లో జరిగే మహాగర్జన సభకు యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట సంజీవ, ఈరగాళ్ల శంకర్, మంద ఎల్లయ్య, మంద నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దులగుట్టలో సామూహిక లక్ష బిల్వార్చన

**-భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. భారీగా పాల్గొన్న భక్తులు**



**బచ్చన్నపేట,అక్టోబరు 26 డ్రీమ్ టైమ్స్ ।**
జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరు గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సిద్దులగుట్టలో సోమవారం సామూహిక లక్ష బిల్వార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని పూలమాలలు, పచ్చని తోరణాలతో సుందరంగా అలంకరించారు. లోకకల్యాణం, ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, పాడిపంటల సమృద్ధిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహకులు చిందం వంశీ, ప్రధాన పూజారి ఓం నమశివాయ, ఆలయ కమిటీ చైర్మన్ ఈదులకంటి వెంకట్‌రెడ్డి, ఆలయ అధికారులు శ్రీనివాస్, లక్ష్మీకాంత్‌రెడ్డి, అర్చకులు సదాశివుడు, సంగమేశ్వర, ఆలయ సిబ్బంది భాను ప్రకాష్‌రెడ్డి, ఆలయ కమిటీ డైరెక్టర్లు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# ఐకేపీ కేంద్రంలోనే వరి ధాన్యం విక్రయించాలి...

**-కొన్నే సర్పంచ్ కోడూరు స్వర్ణలత శివకుమార్ గౌడ్**



**బచ్చన్నపేట, అక్టోబరు 26 డ్రీమ్ టైమ్స్ ।**
రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, పండించిన పంటను ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు విక్రయించాలని కొన్నే గ్రామ సర్పంచ్ కోడూరు స్వర్ణలత శివకుమార్ గౌడ్ సూచించారు. బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామంలో సోమవారం ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులు పంటను కోసిన వెంటనే ఐకేపీ కేంద్రానికి తీసుకువచ్చి విక్రయిస్తే ప్రభుత్వం నిర్ణయించిన ధర లభిస్తుందని తెలిపారు. రైతులు, ఐకేపీ కేంద్రం నిర్వాహకులు హమాలీలకు సహకరించి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తేలు శ్రీనివాస్, గుల్లెన సందీప్, మేకల ప్రదీప్, సీఏలు రేణుక, రమ్య, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు మహేశ్వరి, పిట్టల శివకుమార్, తాటికొండ రామాంజనేయులు, రైతులు, హమాలీలు, ఐకేపీ కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

# నీలిమ ఆస్పత్రిలో రోగులకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శ

**పార్టీలకు అతీతంగా జనగామ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం**



**ఘట్కేసర్,అక్టోబరు 26 డ్రీమ్ టైమ్స్ ।**
జనగామ నియోజకవర్గ ప్రజలకు నీలిమ ఆస్పత్రి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఘట్కేసర్‌లోని నీలిమ ఆస్పత్రిని సందర్శించి, చికిత్స పొందుతున్న నియోజకవర్గ ప్రజలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. వైద్యం సక్రమంగా అందుతోందా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకొని రోగులకు భరోసా కల్పించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి రోగుల ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జనగామ నియోజకవర్గ ప్రజలకు నీలిమ ఆస్పత్రి ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు ఉంటే ఆస్పత్రిలో చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజల ఆరోగ్యమే తన ప్రాధాన్యమని స్పష్టం చేశారు.




# నా బ్రెయిన్ వాడలేదు..

## -సీత పాత్రపై సాయిపల్లవి ఇంట్రెస్టింగ్ కామెంట్స్



డ్యాన్సర్‌గా, నటిగా తమిళం, మలయాళంతోపాటు తెలుగులో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న భామల్లో టాప్‌లో ఉంటుంది సాయిపల్లవి. డైరెక్టర్ ఇచ్చిన పాత్రకు ప్రాణం పోయాలంటే సాయిపల్లవి తర్వాతే ఎవరైనా అని అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఓ వైపు గ్లామర్ రోల్స్ చేస్తూనే.. మరోవైపు నటనకు ఆస్కారమున్న సినిమాలు చేసే సాయిపల్లవి ప్రస్తుతం బాలీవుడ్ మాగ్నమ్ ఓపస్ ప్రాజెక్టు రామాయణలో సీతగా నటిస్తుందని తెలిసిందే.దర్శకుడు ఇచ్చిన ఏ రోల్ అయినా సరే తన మార్క్ యాక్టింగ్ ఉండేలా చూసుకుంటుంది సాయిపల్లవి. ఈ బ్యూటీ బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న కౌన్ బనేగా కరోర్‌పతి షోలో ఆసక్తికర కామెంట్స్ చేసింది. తాను రెగ్యులర్‌గా పోషించే పాత్రల కంటే భిన్నమైన వ్యక్తిత్వం ఉన్న సీత పాత్రను పోషించే అవకాశం రావడం గొప్ప బాధ్యత అని చెప్పింది సాయిపల్లవి. 'నేను పోషించిన ప్రతీ పాత్రకు నా వెర్షన్‌తోపాటు ఇన్‌పుట్స్ ఇచ్చేదాన్ని. కానీ సీత పాత్ర పోషిస్తున్న సమయంలో అంతటి పవిత్రమైన వ్యక్తిత్వం కలిగిన పాత్ర నుంచి నేనేం పొందగలనో అనే దాని గురించి మాత్రమే ఆలోచించాను. నేను నా బుర్రను (మెదడు) అస్సలు ఉపయోగించలేదు. నేను కేవలం సీతమ్మ ఆశీర్వాదాలు తీసుకొని ఆమె పాత్రను ఆకళింపు చేసుకున్నా'నంటూ చెప్పుకొచ్చింది. కౌన్ బనేగా కరోర్‌పతి షోలో సాయిపల్లవి చేసిన ఈ కామెంట్స్ సీతాదేవి పట్ల ఆమెకున్న గౌరవాన్ని చెప్పకనే చెబుతూనే.. మరోవైపు బిగ్ బీని ఇంప్రెస్ చేశాయి.

# జనవరి 1న ప్రారంభం?

అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందనున్న 'RC 17'(వర్కింగ్ టైటిల్) సినిమా ప్రారంభోత్సవం ఎప్పుడు? అనే విషయంపై గత కొన్ని రోజులుగా చర్చ నడుస్తూనే ఉన్నది. ఈ నెలలోనే సినిమా లాంఛనంగా మొదలవ్వనున్నదని నిర్మాతలే గతంలో చెప్పారు. అయితే.. తాజాగా చిత్ర నిర్మాతల్లో ఒకరైన మైత్రీ రవిశంకర్ 'RC 17' ప్రారంభోత్సవంపై క్లారిటీ ఇచ్చారు. నవంబర్ 1న ఘనంగా ఈ చిత్రం ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.అంతేకాదు, ఆ రోజు నుంచే నిరవధికంగా చిత్రీకరణ మొదలవుతుందని ఆయన చెప్పారు. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే.. స్టైలిష్ యాక్షన్, మాస్, లవ్ ఎంటర్‌టైనర్‌లతో వరుసపెట్టి సినిమాలు చేసిన డైరెక్టర్ సుకుమార్.. 'రంగస్థలం' నుంచి స్టైల్ మార్చారు. రూటెడ్ స్టోరీలతో ఆడియన్స్‌ని కట్టిపడేశారు. మళ్లీ ఇప్పుడు రామ్‌చరణ్ సినిమాతోనే ఆయన పంథా మార్చనున్నారు. రామ్‌చరణ్‌తో సుకుమార్ చేయనున్న ఈ సినిమా స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని తెలుస్తున్నది.సారా అర్జున్, ప్రీతి ముకుందన్ వీరిద్దరిలో ఎవరో ఒకర్ని ఇందులో కథానాయికగా ఎంపిక చేస్తారంటూ మొన్నటిదాకా వార్తలొచ్చాయి. ఇప్పుడు తాజాగా 'సయారా' ఫేం అనీత్ పడ్డా పేరు బలంగా వినిపిస్తున్నది. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.



# నచ్చకపోతే నో' చెప్పేస్తా!



నో చెప్పడం చేతకాని వారు జీవితంలో ఎదగలేరని ఆలస్యంగా తెలుసుకున్నాను అంటున్నది మలయాళ మందారం అనుపమ పరమేశ్వరన్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'చిన్నప్పట్నుంచీ కుటుంబ బాధ్యతల్ని నెరవేర్చడమే కర్తవ్యంగా భావించా. నా వల్ల కుటుంబం ఇబ్బందులు పడకూడదనే భయమే నాలో ఎప్పుడూ ఉండేది. ఇలా చాలాకాలం నాకోసం నేను బతకడం మర్చిపోయా.ఒత్తిడిని భరించడం వల్ల మానసిక ఆరోగ్యం పాడైంది. కొలిమిలో కాలితే తప్ప బంగారానికి వన్నె రాదంటారు. అలాగే.. నా జీవితంలో ఎదురైన కొన్ని అనుభవాలు నాలో మార్పును తెచ్చాయి. ఇప్పుడు కేవలం నాకోసం నేను బతుకుతున్నా. ఇన్నాళ్లూ ఇతరులకు 'నో' చెప్పలేక బాధపడ్డాను. ఇప్పుడు నిర్మొహమాటంగా 'నో' చెప్పేస్తున్నా. ఈ మార్పు వల్ల నా మనసిక ప్రశాంతత మెరుగుపడింది' అంటూ చెప్పుకొచ్చింది అనుపమ పరమేశ్వరన్.

# విజయ్‌ను 100 కాదు.. 1000 సార్లు ప్రపోజ్ చేస్తా..

## ట్రోలర్లకు రష్మిక గట్టి సమాధానం!



నటి రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ గురించి సోషల్ మీడియాలో ఇటీవల జరుగుతున్న చర్చ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా వీరిద్దరూ కలిసి పాల్గొన్న 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో రష్మిక చేసిన వ్యాఖ్యలు నెట్టింట చర్చకు దారితీశాయి. విజయ్‌ను పెళ్లి చేసుకోవడానికి తాను అతడికి వందసార్లు ప్రపోజ్ చేసినట్లు ఆమె సరదాగా చెప్పడంతో కొందరు నెటిజన్లు విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో రష్మిక సోషల్ మీడియాలో సుదీర్ఘమైన పోస్ట్ పెట్టి తన అభిప్రాయాలను వెల్లడించారు. తమ బంధం గురించి అసలు విషయం ఏమిటో వివరించే ప్రయత్నం చేశారు.తన గురించి, విజయ్ గురించి ఇంటర్నెట్‌లో జరుగుతున్న చర్చపై రష్మిక స్పందించారు. సాధారణంగా ఇలాంటి విషయాలపై తాను స్పందించనని, ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. ఇతరుల అభిప్రాయాలను చదివి, విషయాలను మరో కోణంలో అర్థం చేసుకోవడానికి కూడా ప్రయత్నిస్తానని తెలిపారు. అయితే తమ ఇంటర్వ్యూపై ప్రస్తుతం జరుగుతున్న చర్చ అభిప్రాయాల వ్యక్తీకరణలా కాకుండా, కోపాన్ని వెళ్లగక్కడానికి ఒకరిని లక్ష్యంగా చేసుకున్నట్లుగా అనిపిస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అసలు విషయం పక్కదారి పట్టిందని, తమ మాటలను కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. విజయ్‌కు వందసార్లు ప్రపోజ్ చేశానన్న వ్యాఖ్యపై వస్తున్న విమర్శలకు రష్మిక తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తమ బంధంలో ఎన్ని సార్లు ప్రపోజ్ చేశామన్నది, ఎంత సమయం తీసుకున్నామన్నది ముఖ్యమైన విషయం కాదని స్పష్టం చేశారు. ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి, తమ జీవితంలో కలిసి ముందుకు సాగాలనే నిర్ణయానికి రావడానికి తగినంత సమయం తీసుకున్నామని వివరించారు. పెళ్లి అంటే కేవలం ప్రపోజ్ చేయడం, మోకాళ్లపై కూర్చోవడం లేదా వేలికి ఉంగరం తొడగడం మాత్రమే కాదని రష్మిక పేర్కొన్నారు. కలిసి ఒక జీవితాన్ని, భవిష్యత్తును నిర్మించుకోవడమే తమకు ముఖ్యమని చెప్పారు. తనకు ఏం కావాలో నిర్ణయించుకునే హక్కు తనకు ఉన్నట్లే, విజయ్‌కు కూడా తన నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉందని తెలిపారు. విజయ్‌ను తాను ఎంతో ప్రేమిస్తున్నానని చెబుతూ, అవసరమైతే వందసార్లు కాదు.. వెయ్యిసార్లు కూడా ప్రపోజ్ చేస్తానని రష్మిక పేర్కొన్నారు. తన జీవితంలో విజయ్‌కు ఉన్న ప్రత్యేక స్థానాన్ని మరోసారి తెలియజేశారు. తనకు ఉచితంగా సలహాలు ఇస్తూ, తన గురించి ఆందోళన చెందుతున్నట్లు చెబుతున్న వారికి కూడా రష్మిక సమాధానమిచ్చారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు తనకు అండగా నిలిచింది విజయ్ మాత్రమేనని పేర్కొన్నారు. ప్రస్తుతం తన జీవితంలో ఎంతో సంతోషంగా ఉన్నానని, ఆ ఆనందం తన ముఖంలో, నటనలో, సినిమాల్లోనూ కనిపిస్తుందని తెలిపారు. తన జీవితం గురించి తాను చెప్పే మాటలను నమ్మకుండా, ఇంటర్నెట్‌లో ప్రచారమయ్యే కల్పిత కథనాలు, నకిలీ చిత్రాలు, అసత్య ప్రచారాలను కొందరు నమ్మడం బాధ కలిగిస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831